18CTR1ffff:18CTR1ffff.qxd 10/17/2026 11:42 PM Page 1



తిరుపతి - చిత్తూరు
తెలుగు జాతీయ దినపత్రిక
వార్త
30 ఏళ్ల ప్రస్థానం వార్త 30 వార్షికోత్సవం 1996 - 2026

### ఐరావతంపై
# ఆనందనిలయుడు



తిరుమల, అక్టోబర్ 17 ప్రభాతవార్తప్రతినిధి:
ద్వాపరయుగంలో మొసలిబారినుండి గజేంద్రుడ్ని కాపాడిన శ్రీమహావిష్ణువు కలియుగంలో భక్తులు పాపాలను తొలగించే వరదహస్తుడిగా వేంకటేశ్వరుడు పూజలందుకుంటున్నాడు. తిరుమలలో జరుగుతున్న బ్రహ్మోత్సవాలలో శనివారం రాత్రి గజవాహనంపై కొండల రాయుడు భక్తులకు దర్శనమిచ్చాడు. శనివారం అందునా గజవాహనం దర్శనంతో భక్తులు గోవిందా అంటూ పులకించారు. అర్చకులు వేదమంత్రోచ్ఛరణల నడుమ స్వామివారిని గజ వాహనంపై అధిరోహింపజేశారు. కర్పూరహారతులిచ్చి రాత్రి 7గంటలకు వాహనం ఆలయమాఢవీధుల్లో ప్రదక్షణగా బయలుదేరింది. గజవాహనంగా అనాదినుంచి ప్రసిద్ధమే. పూర్వం యుద్ధాలలో రథగజాశ్వాలను వాహనాలుగా ఉపయోగించేవారు. రాజుల పట్టాభిషేక సమయంలో గజాధిష్టితులను చేసి ఊరేగిస్తారు. గజవాహనంలో శ్రీనివాసప్రభువును దర్శించుకుని భక్తులు భక్తిపునీతులయ్యారు. ఈ వాహనసేవలో పెద్దజీయర్‌స్వామి, చిన్నజీయర్‌స్వామి, టిటిడి ఈఓముద్దాడ రవిచంద్ర, అదనపు ఈఓ సిహెచ్ వెంకయ్య చౌదరి, బోర్డు సభ్యులు తిరుపతి జిల్లా ఎస్పీ లంకెల సుబ్బరాయుడు, సివిఎస్‌ఓ కెవి మురళీకృష్ణ ,సిపిఆర్ఓ డాక్టర్ తలారి రవి అర్చకులు పాల్గొన్నారు.

## సువాసనలపుష్పక విమానంలో గోవర్ధనగిరిధారిగా మలయప్ప దర్శనం



నవరాత్రి బ్రహ్మోత్సవాల్లో శనివారం సాయంత్రం పుష్ప ప్రియుడు శ్రీవేంకటేశ్వరుడు ఉభయ దేవేరులతో కలసి పుష్పపల్లకిపై ఊరేగాడు. పుష్పక విమానంపై రుక్మిణి, సత్యభామ సమేత గోవర్ధన గిరిధారి శ్రీకృష్ణుని అలంకారంలో మలయప్పస్వామి భక్తులకు అభయ మిచ్చారు. కొబ్బరి చెట్ల ఆకులతో రూపొందించిన ఈ ప్రత్యేక పుష్పక విమానం 24 అడుగుల ఎత్తు, 15 అడుగుల పొడవు, 15 అడుగుల వెడల్పుతో, సుమారు ఒక టన్ను బరువు ఉంటుంది. వివిధ రకాల సంప్రదాయ పుష్పాలతో దీనిని సుందరంగా అలంకరించారు. విమానానికి ఇరువైపులా ఆంజనేయస్వామి, గరుత్మంతుడు, నాలుగుయుగాలకుచెందిన దేవతా మూర్తులరూపాలను తీర్చిదిద్దారు.

**వారం రోజుల శ్రమతో రూపుదిద్దుకున్న కళాఖండం.**
తమిళనాడుకు చెందిన నిపుణులు, టిటిడి ఉద్యానవన విభాగం సిబ్బంది ఈ అద్భుత పుష్పక విమానాన్ని సిద్ధం చేసినట్లు ఉద్యానవనవిభాగం డిప్యూటీ డైరెక్టర్ శ్రీనివాసులు తెలిపారు. చెన్నైకి చెందిన దాత రాంప్రసాద్ భట్ ఈ పుష్పక విమాన రూపకల్పనకు సహకారం అందించారు. వాహనమండపం నుండి సాయంత్రం 4గంటలకు బయలుదేరిన పుష్పపల్లకి ఆలయ నాలుగు మాడవీధుల్లో విహరించి భక్తులకు దర్శనమిచ్చారు.

## స్థానిక ఎన్నికలు పారదర్శకంగా నిర్వహించాలి
### జిల్లా కలెక్టర్ , ఎస్పీ



పులిచెర్ల, అక్టోబర్ 17 ప్రభాతవార్త:
స్థానిక సంస్థల ఎన్నికలను స్వేచ్ఛాయుత, ప్రశాంత వాతావరణంలో పారదర్శకంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్, జిల్లా ఎస్పీ తుషార్ డూడి అధికారులను ఆదేశించారు. శనివారం పులిచెర్ల తహసీల్దార్ కార్యాలయ సమావేశ మందిరంలో ఎంపీపీ, ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికల నిర్వహణ, ఎన్నికల ప్రవర్తనా నియమావళిపై అధికారులతో సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ ప్రజాస్వామ్యంలో ఎన్నికలు అత్యంత కీలకమని, ప్రతి ఓటరు నిర్భయంగా ఓటు హక్కు వినియోగించుకునేలా చర్యలు చేపట్టాలన్నారు. నామినేషన్ల స్వీకరణ, పరిశీలన, ఆమోదం, తిరస్కరణ నుంచి పోలింగ్, కౌంటింగ్, ఫలితాల ప్రకటన వరకు ఎన్నికల సంఘం నిబంధనలను కచ్చితంగా పాటించాలని సూచించారు. ప్రభుత్వ ఉద్యోగులు రాజకీయాలకు అతీతంగా నిష్పక్షపాతంగా వ్యవహరించాలని స్పష్టం చేశారు. జిల్లా ఎస్పీ తుషార్ డూడి మాట్లాడుతూ ఎన్నికల సమయంలో శాంతిభద్రతలకు విఘాతం కలిగించే వారిపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. అభ్యర్థులను బెదిరించడం, ఓటర్లను ప్రలోభపెట్టడం, గుంపులుగా చేరి ఉద్రిక్తతలు సృష్టించడం వంటి చర్యలను సహించబోమన్నారు. నామినేషన్‌కేంద్రాల వద్ద పటిష్ట పోలీసు బందోబస్తు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ప్రజలు ఎలాంటి భయాందోళనలకు గురికాకుండా ఓటు హక్కు వినియోగించుకోవాలని, అనుమానాస్పద కార్యకలాపాలను పోలీసుల దృష్టికి తీసుకురావాలని కోరారు. ఈ సమావేశంలో ఆర్వో సూరిబాబు, రొంపిచెర్ల తహసీల్దార్ కిరణ్ కుమార్, పులిచెర్ల తహసీల్దార్ జయసింహ, ఎంపీడీవోలు రాజశేఖర్, మధుసూదన్, పోలీసు అధికారులు పాల్గొన్నారు.

## సరస్వతిదేవిగా ముత్యాలమ్మ



బంగారుపాళ్యం, అక్టోబర్ 17 ప్రభాతవార్త:
నవరాత్రి బ్రహ్మోత్సవాల్లో భాగంగా సరస్వతి దేవిగా ముత్యాలమ్మ దర్శనమిచ్చారు. శనివారం బంగారుపాళ్యం రాజా వీధిలో వెలసిన గ్రామ దేవత ముత్యాలమ్మకు అర్చకులు మురళీస్వామి, కార్తీక్ స్వాములు అభిషేక పూజలు దీపారాధాన చేపట్టారు. రాత్రి అమ్మవారి ఉత్సవమూర్తికి సరస్వతి దేవిగా అలంకరణ చేపట్టి భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. ఈ ఉత్సవానికి ఉభయదారుఎగా కరణీకర్ సంక్షేమ సంఘం, సర్కిల్ ఇన్స్‌పెక్టర్ కత్తి శ్రీనివాసులు, మాజీ సర్పంచ్ వాణి ప్రియ, బాబురెడ్డి, లీలావతి, భార్గవిలు వ్యవహరించారు. ఇందులో ఆలయ అభివృద్ధి కమిటీ ఛైర్మన్ ఎంబి కృష్ణమూర్తి, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

# ఖరారైన అభ్యర్థులు... వేడెక్కిన రాజకీయం!

### - కూటమి అభ్యర్థి పిట్ల సుహాసిని - వైకాపా అభ్యర్థి మోడీ విమలకుమారి





సూళ్లూరుపేట, అక్టోబర్ 17 ప్రభాతవార్త:
ప్రధాన పార్టీలు తమ పార్టీ తరఫున సూళ్లూరుపేట మున్సిపల్ చైర్ పర్సన్ పదవికి పోటీ చేసే అభ్యర్థులను ప్రకటించడంతో సూళ్లూరుపేట మున్సిపాలిటీ రాజకీయాలు ఒక్కసారిగా వేడెక్కాయి. కూటమి పార్టీల అభ్యర్థిగా పిట్ల సుహాసిని, వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా మోడీ విమల కుమారి ఎన్నికల బరిలో పోటీ పడనున్నారు. సూళ్లూరుపేట మేజర్ పంచాయతీ నుంచి మున్సిపాలిటీగా రూపాంతరం చెందిన తర్వాత ప్రథమంగా ప్రత్యక్ష పద్ధతిలో చైర్మన్ గిరికి ఎన్నికలు జరుగుతున్నాయి. దీంతో ఈ ఎన్నికలకు ప్రాధాన్యత సంతరించుకుంది. ప్రస్తుతం 32 వార్డులుగా ఉన్న సూళ్లూరుపేటలో సుమారు 35 వేల మంది పై చిలుకు ఓటర్లు దాకా ఉన్నారు. గత శాసనసభ ఎన్నికల్లో ఈ మున్సిపాలిటీ పరిధి నుంచి తెలుగుదేశం పార్టీకి సుమారు తొమ్మిది వేల పైచిలుకు మెజారిటీ లభించి ఉంది. ప్రస్తుతం ఆ మెజారిటీని తగ్గకుండా తిరిగి తమ అభ్యర్థిని గెలిపించుకునేందుకు కూటమి నేతలు వ్యూహ రచన చేస్తున్నారు. పిట్ల సుహాసిని మాజీ మండల అధ్యక్షుడు పిట్ల సుబ్రమణ్యం సతీమణి. అలాగే ఈమె మామపిట్ల వెంకట సుబ్బయ్య మూడు పర్యాయములు సూళ్లూరుపేట నియోజకవర్గ ఎమ్మెల్యేగా పనిచేసే ఉన్నారు. రాజకీయ నేపథ్యంకలిగిన కుటుంబం నుంచి వచ్చినపిట్ల సుహాసిని ప్రస్తుతం బరిలో నిలిచి తన అదృష్టాన్ని పరీక్షించుకోనున్నారు. గత మున్సిపల్ ఎన్నికల్లో ఈమె పేరు వినిపించినప్పటికీ అనూహ్య రీతిలో పార్టీ టికెట్టు ఈమెకు లభించలేదు. పిట్ల సుహాసిని అభ్యర్థిత్వాన్ని ప్రముఖ పారిశ్రామికవేత్త కొండేపాటి గంగా ప్రసాద్ బలపరిచి ఆమెకుసహాయ సహకారాలు అందించనున్నారు. ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ ఏమి అభ్యర్థిత్వాన్ని బలపరిచారు. అలాగే నిన్న మొన్నటి వరకు పార్టీ కార్యక్రమాలకు అంటి ముట్టనట్లుగా వ్యవహరిస్తూ వచ్చిన తిరుపతి పార్లమెంటరీ తెలుగుదేశం పార్టీ మాజీ ప్రధాన కార్యదర్శి వేనాటి సతీష్ రెడ్డి ప్రస్తుతం తిరిగి ఉత్సాహంగా పార్టీ కార్యక్రమాల్లో పాల్గొంటున్నారు. అలాగే తాను పార్టీ బలపరిచిన అభ్యర్థి గెలుపు కోసం తన శాయశక్తుల పని చేస్తానని ప్రకటించడంపిట్ల సుహాసిని కిప్లస్‌గా మారింది. వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా రంగంలో ఉన్న మోడీ విమల కుమారి విద్యావంతురాలు రాజకీయాలకు కొత్త ముఖం. కాగా ఈమె తండ్రి కాంగ్రెస్ పార్టీలో చురుకైన కార్యకర్తగా పనిచేస్తూ ప్రస్తుతం వైయస్సార్ కాంగ్రెస్ పార్టీలో ఉన్నాడు. కాగా విమల కుమారి సూళ్లూరుపేట మున్సిపాలిటీలోని సూళ్లూరు ప్రాంతం కావడంతో ఆమెకు స్థాన బలంమెండుగా ఉండే అవకాశాలున్నాయి. మాజీ ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య, మాజీ ఎంపీపీ అల్లూరు అనిల్ కుమార్ రెడ్డి మాజీ మున్సిపల్ చైర్ పర్సన్ దెబ్బల శ్రీమంత్ రెడ్డి తదితరులు ఈమె అభ్యర్థిత్వాన్ని బలపరిచి పార్టీ అభ్యర్థిగా రంగంలోకి తీసుకువచ్చారు. అలాగే మున్సిపల్ కౌన్సిలర్ అభ్యర్థిత్వానికి ఇరు పార్టీలు ఇప్పటికే తమ అభ్యర్థులను సిద్ధం చేసి తుది జాబితాను ప్రకటించారు. అసెంబ్లీ ఎన్నికల ఆధిక్యతను నిలబెట్టుకొని చైర్మన్ గిరిని చేపట్టాలని కూటమి నేతలు భావిస్తుండగా, మున్సిపల్ ఎన్నికల్లో సత్తా చాటి తిరిగి పూర్వ వైభవాన్ని సంతరించుకోవాలని వైయస్సార్సీపీ నేతలు శ్రమిస్తున్నారు. నామినేషన్ల ఉపసంహరణ అనంతరం ప్రచారం ఊపొందు కోనున్నది. ప్రచారానికి కేవలం 8 రోజులు మాత్రమే ఉండడం చైర్మన్ అభ్యర్థులు నేరుగా ఓటర్లను కలిసే పరిస్థితి కనిపించడం లేదు. అలాగే అభ్యర్థుల వ్యయం కూడా తగ్గే అవకాశం ఉంది.

## భయభ్రాంతులతో వైకాపా రాజకీయాలు దారుణం

### - ప్రభుత్వవిప్ డాక్టర్ కంచర్ల శ్రీకాంత్
### - పుంగనూరు.. రాయచోటి ఘటనలు పరాకాష్ట..



కుప్పం, అక్టోబర్ 17 ప్రభాతవార్త
వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్రంలో ప్రజలను భయభ్రాంతుల్ని చేసేలా రాజకీయాలు చేయడం దారుణమని ప్రభుత్వవిప్, ఎమ్మెల్సీ డాక్టర్ కంచర్ల శ్రీకాంత్ పేర్కొన్నారు. శనివారం స్థానిక తెదేపా కార్యాలయంలో ఏర్పాటుచేసిన పాత్రికేయుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మున్సిపల్ నామినేషన్ల సందర్భంగా పుంగనూరు, రాయచోటిలో వైకాపా చేసిన ఘటనలు పరాకాష్టకు చేరాయన్నారు. 2021 ఎన్నికల్లో కుప్పంలో సైతం మాజీ మంత్రి పెద్దిరెడ్డిరామచంద్రారెడ్డి, ఎంపి మిథున్‌రెడ్డి ఇలాంటి అరాచకాలు చేశారన్నారు. వీరి అరాచకాలు గూగుల్‌లో సైతం నేటికీ లభిస్తాయన్నారు. మహిళలపై లాఠీచార్జ్‌లు చేయించారన్నారు. పుంగనూరులో దేశం నేతలను కారుతో తొక్కించడం దారుణమన్నారు. సిఎం చంద్రబాబునాయుడు ఎన్నికలు ప్రశాంతంగా జరగాలని ఆదేశించారని దీంతో కూటమి నేతలు సంయమనంతో ఉనా న్నరన్నారు. ప్రజలు తెలుగుదేశం పక్షాన ఉన్నారన్నారు. కుప్పంలో వందశాతం స్ట్రైక్ రేట్‌తో మున్సిపల్ చైర్మన్, 32వార్డుల్లో ఘన విజయం సాధిస్తామన్నారు. జీవితాలు మార్చే ఎన్నికల్లో ప్రజల జీవితాలు మార్చుతున్న సిఎం చంద్రబాబునాయుడు ఎంపిక చేసే అభ్యర్థులను ప్రజలను గెలిపించాలని కోరారు. పికెఎం ఉడా ఛైర్మన్ డాక్టర్ బిఆర్ సురేష్‌బాబు మాట్లాడుతూ పుంగనూరులో దేశం శ్రేణుల్ని రెచ్చగొట్టేలా వైకాపా నేతలు యత్నించడం దారుణమన్నారు. ప్రభుత్వం ఎంపి మిథున్‌రెడ్డిపై చర్యలు చేపట్టాలని కోరారు. సమావేశంలోసిఎంపిఎ శ్రీకాంత్, మున్సిపల్ మాజీ ఛైర్మన్ డాక్టర్ సుధీర్, మాజీ ఎఎంసి ఛైర్మన్ సత్యేంద్రశేఖర్, మునిస్పల్ ఉపాధ్యక్షుడు ఆర్.శ్రీనివాసులు, మహిళా నేతలు సుగుణమ్మ, అనసూయ, చంద్రకళ తదితరులు పాల్గొన్నారు.

## శ్రీ చెంగాళమ్మకు శ్రీమహాలక్ష్మీ అలంకారం



సూళ్లూరుపేట, అక్టోబర్ 17 ప్రభాతవార్త:
సూళ్లూరుపేటలోని శ్రీ చెంగా ళమాత పరమేశ్వరి దేవస్థానంలో నిర్వహిస్తున్న శరన్నవరాత్రుల్లో భాగంగా శనివారం శ్రీ చెంగాళమ్మకు శ్రీ మహాలక్ష్మి అలంకారాన్ని చేసి భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. ప్రత్యేక అలంకారానికి నాయుడుపేటకు చెందిన ఓడూరు ముని కృష్ణారెడ్డి, పావని దంపతులు ఉభయకర్తలుగా ఉన్నారు. దేవస్థాన ప్రాంగణంలోని యాగ మండపంలో నిర్వహించిన చండీ యాగానికి యర్రం హనుమారెడ్డి, హిమబిందు దంపతులు ఉభయకర్తలగా వ్యవహరించారు. సాయంత్రం స్కాంస్కృతిక కార్యక్రమాల్లో భాగంగా శ్రీ అమృత రవళి సంగీత విద్యాలయం వారిచే సంగీత కార్యక్రమం, శ్రీ నల్లిని ప్రియ నృత్యం ఒంగోలు వారిచే శాస్త్రీయ నృత్యాలు, శ్రీ చెంగాళమ్మ చరితం నృత్య రూపకం, అలేఖ్య బృందం వారిచే భరతనాట్యం, శ్రీ చెన్నకేశవ నాట్యమండలి నెల్లూరు వారిచే హరిచంద్ర వారణాసి ఘట్టం భక్తులను అలరించాయి. అలాగే అమ్మనికి ఆనవాయితీగా సమర్పించే సారెలలో భాగంగా సూళ్లూరు, నాగరాజుపురం, వాటంబేడు రోడ్డు ప్రాంతాల నుంచి భక్తులు వైభవంగా దేవస్థానానికి తరలివచ్చి భక్తి పూర్వకంగా అమ్మవారికి సారెలను సమర్పించారు. దేవస్థాన అసిస్టెంట్ కమిషనర్ బి ప్రసన్నలక్ష్మి పర్యవేక్షణలో ఈ కార్యక్రమాలు జరిగాయి.

## అశ్వవాహనంపై గాయత్రి అలంకరణలో ఎల్లమ్మ



చంద్రగిరి, అక్టోబర్ 17 ప్రభాతవార్త:
చంద్రగిరి గ్రామదేవత శ్రీ మూలస్థాన ఎల్లమ్మ వారు గాయత్రి దేవి అలంకరణలో అశ్వ వాహనంపై విహరిస్తూ భక్తులకు దర్శన మిచ్చారు. సత్యప్రమాణాలకు నెలవై కొలువుదీరిన శ్రీ మూలస్థాన ఎల్లమ్మ వారి దేవీ నవరాత్రి మహోత్సవాలను దేవాదాయ ధర్మాదాయ శాఖ ఆధ్వర్యంలో ఆలయ చైర్మన్ మొక్కల చంద్రశేఖర్ రెడ్డి పాలక మండలి, ఈఓ మమత పర్యవేక్షణలో వైభవంగా నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా శనివార ం ఆలయ అర్చకులు సూరి స్వామి అమ్మవారికి వేకువజామున అభిషేకం జరిపించారు. సాయంత్రం 7 గంటలకు అమ్మవారి ఉత్సవమూర్తిని వేంచేపుగా ఆలయ వాహన మండపానికి తీసుకువచ్చి వివిధరకాల సుగంధ భరిత పుష్పాలు, బంగారు ఆభరణాలతో అమ్మవారికి విశేష అలంకరణ గావించి అశ్వ వాహనంపై అధిష్టింపజేశారు. రాత్రి 8 గంటలకు మేళతాళాలు, మంగళవాయిద్యాలు, బ్యాండుబాజాల నడుమ అమ్మవారి వాహనసేవ కన్నుల పండువగా సాగింది. అమ్మవారి వాహన సేవలో మహిళలు మంగళ హారతులతో కర్పూర నీరాజనాలర్పించారు.

# రెండో రోజు సజావుగా నామినేషన్ల ప్రక్రియ

తిరుపతి కలెక్టరేట్, అక్టోబర్ 17 ప్రభాతవార్త
మున్సిపల్ ఎన్నికలలో భాగంగా తిరుపతి జిల్లాలో రెండో రోజు శనివారం నామినేషన్ల ప్రక్రియ సజావుగా కొనసాగిందని జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎస్ వెంకటేశ్వర్ పేర్కొన్నారు. తిరుపతి నగరపాలక సంస్థ ఎన్నికల సందర్భంగా రెండవ రోజు నామినేషన్ లలో భాగంగా మేయర్ స్థానానికి 11 నామినేషన్లు దాఖలయ్యాయని జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి డా.ఎస్.వెంకటేశ్వర్ శనివారం తెలిపారు. ఈ మేరకు ఆయన మీడియాతో మాట్లాడారు. మేయర్ స్థానానికి దాఖలైన నామినేషన్ లలో టిడిపి తరఫున ఒకటి, స్వతంత్ర అభ్యర్థులుగా 10 నామినేషన్ లు దాఖలు చేయడం జరిగిందన్నారు. అదే విధంగా తిరుపతి నగరపాలక సంస్థ పరిధిలోని 66 డివిజన్లకు సంబంధించి కార్పొరేటర్ స్థానాలకు 184 నామినేషన్ లు దాఖలు చేయడం జరిగిందన్నారు. ఇందులో టిడిపి నుండి 86, వైయస్ఆర్ సీపీ నుండి 18, జనసేన నుండి 18, బిజెపి నుండి 8, సిపిఎం నుండి ఒకటి, స్వతంత్ర అభ్యర్థులుగా 47, ఇతరులు 6 మొత్తం 184 నామినేషన్లు అందాయన్నారు.

**సూళ్లూరుపేట మున్సిపల్ చైర్మన్ స్థానానికి 2, వార్డు మెంబర్లుగా 47 నామినేషన్లు దాఖలు..**
32 వార్డులు గల సూళ్యూరుపేట మున్సిపల్ ఛైర్మన్ స్థానానికి వై ఎస్ ఆర్ సి పి నుండి 2 నామినేషన్ లు దాఖలు కాగా, వార్డ్ మెంబర్ ల కింద 47 నామినేషన్ లు దాఖలు అయ్యాయన్నారు. ఇందులో బిజెపి నుండి 4, టిడిపి నుండి 16, వై ఎస్ ఆర్ సి పి నుండి 19, జనసేన నుండి 2, స్వతంత్ర్య అభ్యర్థులుగా 6, మొత్తం 47 నామినేషన్ లు దాఖలు చేయడం జరిగిందన్నారు.

**నాయుడుపేట మున్సిపల్ చైర్మన్ స్థానానికి 2, వార్డు మెంబర్లుగా 29 నామినేషన్లు దాఖలు..**
నాయుడుపేట మున్సిపల్ ఛైర్మన్ స్థానానికి టిడిపి నుండి ఒకటి, వైఎస్ఆర్సిపి నుండి ఒకటి మొత్తం రెండు నామినేషన్ లు దాఖలు చేయగా, 32 వార్డుల పరిధిలో వార్డ్ మెంబర్లుగా 29 నామినేషన్ లు దాఖలు అయ్యాయన్నారు. ఇందులో బి జె పి నుండి 1, టిడిపి నుండి 3, వై ఎస్ ఆర్ సి పి నుండి 22, జనసేన నుండి 1, స్వతంత్ర్య అభ్యర్థులు 2 మొత్తం 29 నామినేషన్ లు దాఖలు చేశారన్నారు.

**వెంకటగిరి మున్సిపల్ చైర్మన్ స్థానానికి 3, వార్డ్ మెంబర్లుగా 64 నామినేషన్స్ దాఖలు..**
వెంకటగిరి మున్సిపల్ ఛైర్మన్ స్థానానికి వై ఎస్ ఆర్ సి పి, టిడిపి, బి ఎస్ పి నుండి ఒక్కొక్కటి చొప్పున మొత్తం మూడు నామినేషన్లు దాఖలు చేయగా, 36 వార్డుల పరిధిలో టిడిపి నుండి 39, వై ఎస్ ఆర్ సి పి నుండి 25, మొత్తం 64 నామినేషన్ లు దాఖలు చేయడం జరిగిందని పేర్కొన్నారు.

**పుత్తూరు మున్సిపల్ చైర్మన్ స్థానానికి 5, కార్పొరేటర్లుగా 72 నామినేషన్ దాఖలు..**
పుత్తూరు మున్సిపల్ ఛైర్మన్ స్థానానికి వై ఎస్ ఆర్ సి పి నుండి 3, టిడిపి నుండి 1, జనసేన నుండి 1 మొత్తం ఐదు నామినేషన్లు దాఖలు చేయగా, 36 వార్డుల పరిధిలో టిడిపి నుండి 48, వై ఎస్ ఆర్ సి పి నుండి 24, జనసేన నుండి 2, స్వతంత్ర అభ్యర్థుల నుండి 2 మొత్తం 76 నామినేషన్ లు దాఖలు చేయడం జరిగిందని పేర్కొన్నారు.

## తిరుపతి మేయర్ టిడిపి అభ్యర్థి జేబీ శ్రీనివాస్ నామినేషన్ దాఖలు



తిరుపతి కార్పొరేషన్, సెప్టెంబర్, 19 ప్రభాతవార్త:
తిరుపతి మేయర్ అభ్యర్థి జేబీ శ్రీనివాస్ ముందుగా తన తల్లి గారిని కలిసి ఆశీర్వాదం తీసుకుని నామినేషన్ పత్రాలతో ఆర్వో వద్దకు చేరుకుని నామినేషన్ సమర్పించారు. ఆయన వెంట తిరుపతి ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు, యాదవ కార్పొరేషన్ ఛైర్మన్ నరసింహ యాదవ్, పార్లమెంట్ అధ్యక్షురాలు పనబాక లక్ష్మి, ఆంధ్ర ప్రదేశ్ హస్తకళల అభివృద్ధి కార్పొరేషన్ ఛైర్మన్ డాక్టర్ హరిప్రసాద్, బీజేపీ జిల్లా అధ్యక్షుడు శ్రీ సామంచి శ్రీనివాస్, ప్రముఖ నిర్మాత ఎన్వీ ప్రసాద్ , కూటమి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## చిత్తూరు మేయర్, 3 మున్సిపల్ చైర్మన్ కుర్చీలకు 24 నామినేషన్లు

### - చిత్తూరు మేయర్ స్థానంకు 8, కుప్పం మున్సిపల్ చైర్మన్‌కు 7, నగరి చైర్మన్‌కు 7, పలమనేరు చైర్మన్‌కు 2 నామినేషన్లు



తెలుగుదేశం మేయర్ అభ్యర్థిగా నామినేషన్ దాఖలు చేస్తున్న కఠారి హేమలత, వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ మేయర్ అభ్యర్థిగా నామినేషన్ దాఖలు చేస్తున్న ఆర్.చంద్రశేఖర్

*చిత్తూరు, అక్టోబర్ 17 ప్రభాతవార్త:*
*మున్సిపల్ ఎన్నికలకు నామినేషన్ల రెండవ రోజు నామినేషన్లు ఊపందుకున్నాయి. చిత్తూరు మున్సిపల్ మేయర్, కుప్పం, నగరి, పలమనేరు మున్సిపల్ ఛైర్మన్ కుర్చీలకు శనివారం 24 నామినేషన్లు దాఖలు అయ్యాయి. చిత్తూరు మున్సిపల్ మేయర్ కుర్చీకి శనివారం 8 నామినేషన్లు దాఖలు కాగా, కుప్పం మున్సిపల్ ఛైర్మన్ కుర్చీకి 7, నగరి మున్సిపల్ ఛైర్మన్ కుర్చీకి 7, పలమనేరు మున్సిపల్ ఛైర్మన్‌గిరికి 2 నామినేషన్లు దాఖలు అయ్యాయి. అలాగే చిత్తూరు మున్సిపల్ కార్పొరేషన్‌లో కార్పొరేటర్లుగా పోటీ చేయడానికి 60 డివిజన్ల పరిధిలో 216 నామినేషన్లు దాఖలు అయ్యాయి. అలాగే కుప్పం మున్సిపల్ కౌన్సిలర్లుగా పోటీ చేయడానికి 32 వార్డులకు శనివారం 134 మంది అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేశారు. అలాగే నగరి మున్సిపల్ కౌన్సిలర్ స్థానాలకు సంబంధించి మొత్తం 40 వార్డులకు 112 మంది అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేశారు. అలాగే పలమనేరు మున్సిపాల్టీలో మొత్తం 36 వార్డులు వుండగా ఈ స్థానాల్లో పోటీ చేయడానికి 62 మంది అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేశారు.*

18 CTR 2:18 CTR 2.qxd 10/17/2026 11:34 PM Page 1



# సమర్థవంతంగా ఎన్నికల శిక్షణ - జాయింట్ కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్

**చిత్తూరు, అక్టోబర్ 17 ప్రభాతవార్త:**

జడ్పీటిసీ, ఎంపిటిసీ ఎన్నికల నిర్వహణ చేపట్టే పోలింగ్ అధికారులు, సహాయ పోలింగ్ అధికారులకు సమర్థవంతంగా శిక్షణ అందించాలని జాయింట్ కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్ అన్నారు. జడ్పీ సమావేశభవనంలో జాయింట్ కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్ ఆధ్వర్యంలో శనివారం రెండో విడత ఎన్నికల శిక్షణ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో జెసి మాట్లాడుతూ ఎన్నికల విధుల నిర్వహణలో ఎలాంటి పొరబాట్లకు తావు లేకుండా, ఎన్నికల చట్టాలు, నిబంధనలు, మార్గదర్శకాలకు అనుగుణంగా విధులు నిర్వర్తించాలన్నారు. జిల్లాలో ఎన్నికల నిర్వహణకు వేలాది ప్రిసైడింగ్ అధికారులు, పోలింగ్ అధికారులు, సహాయ పోలింగ్ అధికారుల సేవలు అవసరం అవుతాయన్నారు. పెద్ద సంఖ్యలో వున్న సిబ్బందికి ఒకేసారి శిక్షణ ఇవ్వడం సాధ్యం కానందున, మండలాల వారీగా మాస్టర్ ట్రైనర్లతో శిక్షణా తరగతులు నిర్వహించేలా ప్రణాళికలు సిద్ధం చేశామన్నారు. ప్రతి శిక్షణ తరగతికి 50 నుండి 60 మంది సిబ్బందిని కేటాయించి, ప్రతి ఒక్కరికి ఎన్నికల విధులపై స్పష్టమైన అవగాహన కల్పించాలన్నారు. ఎన్నికల నిర్వహణ అనేది పూర్తిగా నిబంధనలకు లోబడి నిర్వహించే ప్రక్రియ అని, ప్రతి దశలోను ఎన్నికల చట్టాలు, నియమావళి, అధికారిక మార్గదర్శకాలను తప్పనిసరిగా పాటించాలని స్పష్టం చేశారు. ఎన్నికల విధుల్లో చిన్న పొరబాటు చేసినా తీవ్ర పరిణామాలు ఎదురయ్యే అవకాశం



వుండటంతో మాస్టర్ ట్రైనర్లు తమకు అందించిన శిక్షణా సామాగ్రిని పూర్తిగా అధ్యాయనం చేసి, సందేహాలను నివృత్తి చేసుకున్న తర్వాతే క్షేత్ర స్థాయి సిబ్బందికి శిక్షణ ఇవ్వాలన్నారు. గతంలో ఎన్నికలు నిర్వహించిన అనుభవం వున్నప్పటికీ ప్రతి ఎన్నికల్లోను నిబంధనలు, విధానాల్లో మార్పులు వుండే అవకాశం వుండటంతో తాజా మార్గదర్శకాలను తెలుసుకోవాలన్నారు. పోలింగ్, సహాయ పోలింగ్ అధికారులు, ప్రిసైడింగ్ అధికారుల విధులు, ఎన్నికల సమయంలో అనుసరించాల్సిన ప్రతి దశను మాస్టర్ ట్రైనర్లు స్పష్టంగా వివరించాలన్నారు. శిక్షణా సమయంలో సిబ్బంది అడిగే సందేహాలకు అధికారిక శిక్షణ సామాగ్రి ఆధారంగా సమాధానాలు ఇవ్వాలని, ఊహాజనిత సమాచారంతో వివరణలు ఇవ్వరాదని స్పష్టం చేశారు. ఈ నెల 21వ తేదీన నిర్వహించనున్న శిక్షణ కార్యక్రమానికి మాస్టర్ ట్రైనర్లు పూర్తి స్థాయిలో సిద్ధం కావాలని ఆదేశించారు. శిక్షణా తరగతులను అర్డీఓలు, తహసిల్దార్లు పర్యవేక్షిస్తారని, శిక్షణకు సంబంధించిన సందేహాలు, సమస్యలను పరిష్కరించడానికి ప్రత్యేక వాట్సాప్ గ్రూప్‌ను ఏర్పాటు చేసి అవసరమైన మార్గదర్శకాలు అందిస్తామన్నారు. ఎన్నికల నిర్వహణలో జిల్లా పనితీరు మాస్టర్ ట్రైనర్లు అందించే శిక్షణ నాణ్యతపై ఆధారపడి వుంటుందని, ఉపాధ్యాయులు తమ బోధనా నైపుణ్యంను వినియోగించి, ఎన్నికల సిబ్బందికి పూర్తి స్థాయిలో అవగాహన కల్పించాలని కోరారు. ఎన్నికల విధులను పారదర్శకంగా, నిబంధనలకు అనుగుణంగా నిర్వహించేందుకు ప్రతి ఒక్కరు బాధ్యతతో అంకిత భావంతో విధులు నిర్వర్తించాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎజీఎస్‌డబ్ల్యు అధికారి రవికుమార్, ఎఎస్ఓ సౌందర్‌రాజన్‌లు శిక్షణ అందించగా, మాస్టర్ ట్రైనర్లు ఈ శిక్షణలో పాల్గొన్నారు.

## కల్యాణ వెంకటేశ్వర స్వామి గరుడ సేవలో ముక్కా రూపానందరెడ్డి

**రైల్వేకోడూరు రూరల్, అక్టోబర్ 17 ప్రభాతవార్త**



రైల్వే కోడూరు మండలంలోని కే.బుడుగుంట పల్లెలో నిర్మించిన కళ్యాణ వెంకటేశ్వర స్వామి ఆలయంలో శనివారం వైభవపేతంగా గరుడసేవ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముక్కా రూపానంద రెడ్డి పాల్గొన్నారు. స్వామివారి ఊరేగింపు కార్యక్రమంలో భక్తులు భారీగా పాల్గొన్నారు. అదేవిధంగా ఈ కార్యక్రమానికి టిడిపి ఇన్చార్జ్ ముక్కా రూపానంద రెడ్డి స్వామివారి సేవలో పాల్గొని అనంతరం విలేకరులతో మాట్లాడుతూ స్వామివారి సేవలో రెండు సంవత్సరాలుగా పాల్గొంటున్నానని, స్వామి సేవలో పాల్గొనడమే తాను పూర్వజన్మ సుకృతంగా భావిస్తున్నానని గతంలో కుటుంబ సభ్యులతో ఈ ఆలయంలో స్వామివారి సేవలో పాల్గొన్నానని, అదేవిధంగా ఈ సంవత్సరం స్వామివారి సేవలో పాల్గొన్నానని, నియోజకవర్గ ప్రజలందరూ సుఖ సంతోషాలతో వర్ధిల్లాలని స్వామివారిని కోరుకున్నట్లు ఆయన తెలిపారు. ఆలయ సిబ్బంది గరుడ సేవ సందర్భంగా భక్తులకు ఎటువంటి ఆటంకాలు కలగకుండా భారీ ఏర్పాట్లు చేశారు. ఈ కార్యక్రమంలో తిరుపతి శేఖర్, సుబ్బరామిరెడ్డి తోపాటు ఆలయ కమిటీ, భక్తులు పాల్గొన్నారు.

## మందుల దుకాణాల్లో ఆకస్మిక తనిఖీలు

**చిట్వేలి, అక్టోబర్ 17 ప్రభాతవార్త:**



చిట్వేలి మండలంలోని మందుల దుకాణాల్లో తిరుపతి జిల్లా డ్రగ్ ఇన్‌స్పెక్టర్ రూత్ శనివారం ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. షాపుల లైసెన్సు, ఔషధాల నిల్వలు, విక్రయాలు, రికార్డులను పరిశీలించారు. వైద్యుల సిఫారసు లేకుండా ఎన్ఆర్ఎక్స్ మందులు, ప్రెగ్నెన్సీ కిట్లు విక్రయించరాదని అన్నారు. గడువు ముగిసిన మందులు, ఫిజీషియన్ శాంపిళ్లు దుకాణాల్లో ఉంచరాదని ఆమె స్పష్టం చేశారు. నిబంధనలు ఉల్లంఘిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని అధికారిని రూత్ మందుల దుకాణ నిర్వాహకులను హెచ్చరించారు.

## మహాలక్ష్మీదేవిగా భద్రకాళి.. కృష్ణమూర్తిగా వాసవి మాత







**చిట్వేలి, అక్టోబర్ 17, ప్రభాతవార్త:**

దసరా శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఏడవ రోజు శనివారం శ్రీ భద్రకాళి అమ్మవారు మహాలక్ష్మీదేవిగా, శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి అమ్మవారు కృష్ణమూర్తిగా, శ్యామలాంబ అమ్మవారు ప్రత్యేక అలంకారాల్లో భక్తులకు దర్శనమిచ్చారు. అర్చకులు ఉదయం అభిషేకం, కుంకుమార్చన, ప్రత్యేక పూజలు నిర్వహించారు. మహాలక్ష్మీదేవి అలంకారం ఐశ్వర్యం, సిరిసంపదలు, శుభప్రదానికి ప్రతీక కాగా, కృష్ణమూర్తి అలంకారం ప్రేమ, ధర్మం, భక్తి, లోకకల్యాణానికి ప్రతీకగా నిలుస్తుంది. అమ్మవార్లను దర్శించుకున్న భక్తులు భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించి తీర్థప్రసాదాలు స్వీకరించారు. రాజంపేట సహారా బ్యాంకు విశ్వనాథరెడ్డి శ్రీ భద్రకాళి అమ్మవారి మహాలక్ష్మి దేవి అలంకరణ ఉభయులుగా నిలిచారు. ఆలయ పెద్దలు భక్తులకు అన్నదాన వితరణ చేశారు.

## చిత్తూరులో భారీ వర్షం



**చిత్తూరు, అక్టోబర్ 17 ప్రభాత వార్త:** జిల్లా కేంద్రం చిత్తూరులో శనివారం సాయంత్రం భారీ వర్షం కురిసింది. చిత్తూరులో భారీ వర్షం కురవడంతో నగర పరిధిలోని రోడ్లు జలమయం అయ్యాయి. మురికి కాలువలు పొంగి పొర్లుతున్నాయి. చిత్తూరు ఎంఎస్ఆర్ సర్కిల్, పొన్ని యమ్మన్ గుడి వీధులను వర్షపు నీరు ముంచెత్తింది. రోడ్లపై నీటి ప్రవాహం అధికంగా వుండటంతో వాహదారులు, పాదచారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. వర్షపు నీటితో రోడ్లు నిండిపోవడంతో పలు చోట్ల ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం ఏర్పడింది. దర్గా జంక్షన్, సంతపేట రోడ్డు, గిరింపేట రోడ్లలో వర్షపు నీరు నిలిచిపోవడంతో వాహనదారులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఇటీవల కాలంలో ఇంత భారీ వర్షం చిత్తూరు పరిసరాల్లో కురవకపోవడం, ఒక్కసారిగా వర్షం అధికంగా నమోదు కావడంతో రోడ్లపై నీరు పూర్తి స్థాయిలో నిలిచిపోయింది. రెండు గంటల పాటు వర్షం కొనసాగడంతో ప్రజలు ఉపశమనం పొందారు.

## ఎన్నికల ప్రక్రియ ప్రశాంతంగా నిర్వహించేలా చర్యలు

**- డిఎస్పీ వెంకట నారాయణ**



**చిత్తూరు, అక్టోబర్ 17 ప్రభాతవార్త:** మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో నిర్వహించేలా పోలీసు శాఖ అప్రమత్తంగా విధులు నిర్వహించాలని డిఎస్పీ వెంకట నారాయణ పోలీసు అధికారులను ఆదేశించారు. డిఎస్పీ వెంకట నారాయణ శనివారం మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయంలో కొనసాగుతున్న నామినేషన్ల దాఖలు ప్రక్రియ, అక్కడ ఏర్పాటు చేసిన పోలీసు బందోబస్తు ఏర్పాట్లను పరిశీలించి అక్కడ విధులు నిర్వహిస్తున్న సిబ్బందికి సూచనలు జారీ చేశారు. ఈ సందర్భంగా డిఎస్పీ మాట్లాడుతూ ఎన్నికల ప్రక్రియ ప్రశాంతంగా, పారదర్శకంగా, ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా నిర్వహించడానికి పోలీసు అధికారులు అప్రమత్తంగా విధులు నిర్వర్తించాలన్నారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళిని ప్రతి ఒక్కరు తప్పనిసరిగా పాటించాలని, నామినేషన్ కేంద్రం చుట్టూ 100 మీటర్ల పరిధిలో అనధికార వ్యక్తులు గుమిగూడకుండా తగిన చర్యలు తీసుకోవాలన్నారు. నామినేషన్ దాఖలు చేసే అభ్యర్థి, నిబంధనల ప్రకారం అనుమతించబడిన వ్యక్తులకు మాత్రమే నామినేషన్ కేంద్రంలోకి ప్రవేశం కల్పించాలని పోలీసులను ఆదేశించారు. ఎన్నికల నిబంధనలకు ఉల్లంఘించడం, పోలీసుల విధులకు ఆటంకం కల్గించడం, శాంతిభద్రతలకు విఘాతం కల్గించే చర్యలకు పాల్పడితే చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. చిత్తూరు సబ్ డివిజన్ పరిధిలో శాంతిభద్రతల పరిరక్షణకు, ఎన్నికల సమయంలో ప్రజా భద్రతను కాపాడేందుకు సంబంధిత చట్టాలు, అధికారికంగా జారీ చేసిన ఆదేశాల ప్రకారం చర్యలు తీసుకుంటామన్నారు. అమలులో వున్న నిషేధాజ్ఞలు, పోలీసు యాక్ట్ సెక్షన్ 30కు సంబంధించిన ఆదేశాలను ప్రతి ఒక్కరు తప్పనిసరిగా పాటించాలన్నారు. ఈ కార్యక్రమంలో వన్‌టౌన్ ఇన్స్‌పెక్టర్ పెద్దచిన్నయ్య, పూతలపట్టు ఇన్స్‌పెక్టర్ తిమ్మయ్య, యాదమరి ఎస్ఐ ఈశ్వరయ్య, పెనుమూరు ఎస్ఐ శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

## బైరెడ్డిపల్లి ఎంపిపి రేసులో కృష్ణవేణి జయకుమార్



**బైరెడ్డిపల్లి, అక్టోబర్ 17 ప్రభాతవార్త**

బైరెడ్డిపల్లి మండల ఎంపిపి రేసులో మాజీ ఎంపిపి అయిన కృష్ణవేణి జయకుమార్ ఉన్నారు. 1995లో తెదేపా తరపున పోటీచేసి గెలిచి ఎంపిపిగా పనిచేశారు. ఈమె భర్త జయకుమార్ 1985-1995లో బైరెడ్డిపల్లి సర్పంచ్‌గా పనిచేశారు. ప్రస్తుతం బైరెడ్డిపల్లి ఎంపిపి స్థానం జనరల్ మహిళ కావడంతో తనకు రెండోసారి అవకాశం వస్తుందని ఆమె ఎదురుచూస్తున్నారు. ఈ విషయంగా ఆమె మాట్లాడుతూ ఎమ్మెల్యే అమరనాథ్‌రెడ్డి తమకు న్యాయం చేస్తారనే నమ్మకం ఉందన్నారు. కాగా బైరెడ్డిపల్లి టిడిపి మండల అధ్యక్షుడు కిషోర్‌గౌడ్ భార్య రాధ కిషోర్ సైతం ఎంపిపి సీటు ఆశిస్తున్నట్లు సమాచారం.

## ప్రజాస్వామ్య యుతంగా స్థానిక సంస్థల ఎన్నికలు

**- రాష్ట్ర సిపిఐ కార్యవర్గ సభ్యులు రామానాయుడు డిమాండ్**

**చిత్తూరు, అక్టోబర్ 17 ప్రభాతవార్త:**





స్థానిక సంస్థల ఎన్నికలు ప్రజాస్వామ్య పద్ధతుల్లో, శాంతియుతంగా, దౌర్జన్యాలు లేకుండా ఓటర్ల స్వతంత్ర్యంగా ఓటు హక్కును వినియోగించుకునే పరిస్థితిని కల్పించాలనిజిల్లా ఎన్నికల అధికారి, పోలీసు యంత్రాంగం చర్యలు తీసుకోవాలని రాష్ట్ర సిపిఐ కార్యవర్గ సభ్యులు రామానాయుడు డిమాండ్ చేశారు. చిత్తూరు సిపిఐ కార్యాలయంలో శనివారం చిత్తూరు నగర సిపిఐ సభ్యులతో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ నిరంతరం అన్ని వర్గాల ప్రజా సమస్యల పరిష్కారం కోసం రాజీ లేని పోరాటం చేస్తున్న సిపిఐ కార్యకర్తలు స్థానిక ఎన్నికల్లో పోటీ చేస్తున్నారని వీరికి అండగా నిలవాలని ఆయన ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో జిల్లా సిపిఐ కార్యదర్శి నాగరాజు, నగర కార్యదర్శి విసి గోపినాథ్, కె.మణి, విజయగౌరి, ఎ.సత్యమూర్తి, ఎ.జమిలాబీ, పి.గజేంద్రబాబు, వి.కోమల, హెచ్.బాలాజీరావు తదితరులు పాల్గొన్నారు.

## మొగిలీశ్వరాలయంలో నవరాత్రి ఉత్సవాలు

**బంగారుపాళ్యం, అక్టోబర్ 17 ప్రభాతవార్త:**



మండలంలోని మొగిలి నందు వెలసిన స్వయంభూ శ్రీ మొగిలీశ్వరాలయంలో నవరాత్రి ఉత్సవాలు ప్రతి ఘనంగా నిర్వహిస్తున్నారు. ఆలయంలోని మూల విరాట్ కామాక్షమ్మ అమ్మవారికి సరస్వతి దేవిగా అలంకరణ చేపట్టారు. ఉదయం అమ్మవారికి అభిషేకాలు, మహాదీపారాధాన తదితర కార్యక్రమాలను నిర్వహించారు. ఈ ఉత్సవానికి ఆలయ అభివృద్ధి కమిటీ ఛైర్మన్ కమలనాథరెడ్డి, సభ్యులు గీతా మనోహర్, త్రివేని గిరిబాబు, కనకదుర్గ వెంకటేశులు, జమునా సుబ్రమణ్యం, సంజీవి, హేమచంద్రనాయుడు, శ్రీనివాసులు ఉభయదారులుగా వ్యవహరించారు. ఉత్సవ కార్యక్రమంలో ఆలయ అర్చకులు రెడ్డప్ప గురుకుల్, గంగాధర్ గురుకుల్, దండపాణి గురుకుల్‌లు పాల్గొన్నారు.

## సింగ్గిరివారిపల్లెలో శ్రీ సీతారాముల స్వామి విగ్రహ ప్రతిష్ట



**రైల్వే కోడూరు రూరల్, అక్టోబర్ 17 ప్రభాతవార్త**

రైల్వే కోడూరు మండలంలోని సింగిరివారిపల్లెలో శనివారం శ్రీ సీతారాముల లక్ష్మణ హనుమంతల స్థిర విగ్రహ ప్రతిష్టాపన, సీతారాముల కల్యాణోత్సవానికి గ్రామస్తుల ఆహ్వానం మేరకు సీతారాముల వారికి ప్రత్యేక పూజా కార్యక్రమాలలో రైల్వేకోడూరు వైసీపీ సీనియర్ నాయకులు, మండల అధ్యక్షులు రామిరెడ్డి ధ్వజారెడ్డి, మాజీ ఉపసర్పంచ్ తోట శివ సాయిలు సీతారాములు వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సింగిరి వారి పల్లె నడిబొడ్డున ఈ ఆలయాన్ని నిర్మించడం అదేవిధంగా పూజలో పాల్గొనడం పూర్వజన్మ సుకృతమని వారు అన్నారు. గ్రామస్తులు మేళ తాళాలతో ఘనంగా స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచులు ఆర్వి రమణ, చంగల్ రెడ్డి, గోపి, బీమా ప్రతాపరెడ్డి, కృష్ణారెడ్డి, ప్రసాద్, బత్తల సుబ్రహ్మణ్యం, అనంత రా జుపేట మైనారిటీ నాయకులు షఫీ, నాగరాజు, శివాజీ, లక్ష్మీపతి తదితర ప్రముఖులు పాల్గొన్నారు.

## జాతీయ సాయి ట్రెక్కింగ్ క్యాంపునకు హైస్కూల్ విద్యార్థులు

**చిట్వేలి, అక్టోబర్ 17 ప్రభాతవార్త:**





కేరళ రాష్ట్రంలో ఈ నెల 20 నుంచి 27 వరకు నిర్వహించనున్న ఆల్ ఇండియా ట్రెక్కింగ్ క్యాంపునకు చిట్వేలి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఎన్సీసీ విద్యార్థులు చెంజి అక్షయ, గోర్ల వైష్ణవి, ఆవుల రమ్య ఎంపికయ్యారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు బాలరాజు దుర్గరాజు, ఎన్సీసీ అధికారి పసుపుల రాజశేఖర్ హర్షం వ్యక్తం చేశారు. జాతీయ స్థాయి శిబిరంలో పాల్గొనడం ద్వారా విద్యార్థుల్లో క్రమశిక్షణ, నాయకత్వ లక్షణాలు, ఆత్మవిశ్వాసం, జాతీయ సమైక్యతా భావం పెంపొందుతాయని ఎన్సిసి అధికారి రాజశేఖర్ పేర్కొన్నారు. ఎంపికైన విద్యార్థులను ఉపాధ్యాయులు, సిబ్బంది అభినందించారు.

## శ్రీదండు కొండమ్మ అమ్మవారికి విశేష పూజలు



**చిట్వేలి, అక్టోబర్ 17 ప్రభాతవార్త:**

దసరా శరన్నవరాత్రి ఉత్సవాల సందర్భంగా చిట్వేలి మండల పరిధిలోని సి.కందులవారి పల్లి గ్రామంలో గ్రామ దేవతగా కొలువై పూజలు అందుకుంటున్న శ్రీ దండు కొండమ్మ అమ్మవారికి శనివారం మూలా నక్షత్రం సందర్భంగా గ్రామస్తులు విశేష పూజలు నిర్వహించారు. మూల విగ్రహాన్ని అర్చకులు ప్రత్యేక పూజలు అలంకారాలు చేపట్టారు. గ్రామస్తులు భక్తిశ్రద్ధలతో మొక్కులు తీర్చుకున్నారు. ఉత్సవ విగ్రహానికి ఉదయం అభిషేకం, తదుపరి సామూహికంగా మహిళలచే కుంకుమ అర్చన నిర్వహించారు. మధ్యాహ్నం పెద్ద ఎత్తున అన్నదాన కార్యక్రమం చేపట్టారు. సాయంత్రం గ్రామోత్సవాన్ని మంగళ వాయిద్యాల నడుమ నిర్వహించారు. కార్యక్రమంలో మండల పరిధిలోని

# చిత్తూరు డివిజన్

చిత్తూరు, గంగాధరనెల్లూరు, పూతలపట్టు పలమనేరు, కుప్పం,

## కుప్పంలో రెండోరోజు భారీగా నామినేషన్లు

**- ఛైర్మన్‌కు 5.. కౌన్సిలర్ స్థానాలకు 123 ..నేడు నామినేషన్లకు ఆఖరు !!**

**కుప్పం, అక్టోబర్ 17 ప్రభాతవార్త**



రాష్ట్రంలో ప్రతిష్టాత్మకమైన కుప్పం మున్సిపాలిటీ ఎన్నికలకు సంబంధించి శని వారం అభ్యర్థిత్వాలు ఆశిస్తున్నవారుభారీగా నామినే షన్లు దాఖలు చేశా రు. ఉదయం 11గంటలకు నామినేషన్ల స్వీకరణ మొదలు కాగా మధ్యాహ్నం 3గంటల వరకు మున్సిపల్ ఛైర్మన్ స్థానంకు ఐదు నామినేషన్లు దాఖలయ్యాయి. వీటిలో వైకాపా తరపున 4, తెదేపా తరపున 1 ఉన్నాయి. అలాగే 32 వార్డుల్లో కౌన్సిలర్ సీటుకు సంబంధించి మొత్తం 123 నామినేషన్లు శనివారం దాఖలయ్యాయి. వీటిలో తెలుగుదేశం పార్టీ తరపున 61, వైకాపా తరపున 53, ఇండిపెండెంట్లు 5మంది, జనసేన తరపున 4మంది నామినేషన్లు దాఖలు చేశారు. అత్యధికంగా 21వ వార్డులో శనివారం తొమ్మిది నామినేషన్లు దాఖలయ్యాయి. పలువురు అభ్యర్థులు రెండేసి నామినేషన్లు దాఖలు చేశారు. నామినేషన్ల దాఖలు సందర్భంగా నామినేషన్ కేంద్రం వద్ద ఎఎస్పీ బి.హేమంత్ అధ్వర్యంలో పోలీసు అధికారులు, సిబ్బంది గట్టి బందోబస్తు నిర్వహించారు. అంతకుముందు ఎఎస్పీ నామినేషన్‌కేంద్రాన్ని పరిశీలించి అధికారులకు తగు సూచనలు చేశారు. కాగా ఆదివారం నామినేషన్ల దాఖలుకు గడువు ముగియనుంది. తొలిరోజు శుక్రవారం కౌన్సిలర్ వార్డులకు 11, మున్సిపల్ ఛైర్మన్‌కు 2 నామినేషన్లు మాత్రమే దాఖలైన విషయం విదితమే.

## శాశ్వత నిత్యాన్నదాన పథకానికి లక్ష విరాళం



**కాణిపాకం, అక్టోబర్ 17 ప్రభాతవార్త:**

కాణిపాకం శ్రీవరసిద్ధి వినాయక స్వామివారి దేవస్థానంలో అమలవుతున్న శాశ్వత నిత్యాన్నదాన పథకానికి ఓ భక్తుడు శనివారం లక్ష రూపాయలను విరాళంగా అందజేశారు. ఈమే రకు బెంగుళూరుకు చెందిన ఉదయ్ భాస్కర్‌నాయుడు అనే భక్తుడు శాశ్వత నిత్యాన్నదాన పథకంకు 1,00.116 రూపాయలను విరాళంగా అందజేశారు. దాతలు విరాళ మొత్తాన్ని కుటుంబసభ్యులతో కలసి సూపరెండెంట్ వాసుకు అందజేశారు. దాతలకు ఆలయ సం ప్రదాయం ప్రకారం స్వామివారి దర్శనం కల్పించి తీర్ధ, ప్రసాదాలను అందజేశారు. ఈకార్యక్రమంలో టెంపుల్ ఇన్స్‌పెక్టర్ బాలాజినాయుడు, దాత కుటుంబసభ్యులు పాల్గొన్నారు.

## లాడ్జీల్లో ఎఎస్పీచే ఆకస్మిక తనిఖీలు

**కుప్పం, అక్టోబర్ 17 ప్రభాతవార్త**



మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో కుప్పం పట్టణ పరిసరాల్లోని పలు లాడ్జీల్లో కుప్పం ఎఎస్పీ బి.హేమంత్ శుక్రవారం అర్ధరాత్రి ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. ఈసందర్భంగా లాడ్జీల్లో బస చేసిన వారి వివరాలు అడిగి తెలుసుకున్నారు. వారి ఆధారాలు పరిశీలించారు. కొత్త వ్యక్తులు ఎవరైనా లాడ్జీలకు వస్తే సమాచారం అందించాలని లాడ్జీల యజమానులను ఆదేశించారు. కార్యక్రమంలో అర్బన్ సిఐ జి.టి.నాయుడు, అర్బన్ ఎస్సై బాబు, సిబ్బంది పాల్గొన్నారు.

## వైకాపా తరపున ఛైర్మన్ అభ్యర్థికై నాలుగు నామినేషన్లు



**కుప్పం, అక్టోబర్ 17 ప్రభాతవార్త**

కుప్పం మున్సిపల్ ఛైర్మన్ పదవికై వైకాపా తరపున శనివారం నలుగురుమంది నామినేషన్లు దాఖలు చేశారు. కుప్పం పట్టణంకు చెందిన కె. గణేష్‌తో పాటు నాగరాజు, బత్తలపల్లి విజయ్‌కుమార్, కె.మూర్తి నామినేషన్లు దాఖలు చేశారు. వీరిలో నాగరాజు, విజయ్‌కుమార్ ఇదివరకు వైకాపా కౌన్సిలర్లుగా ఉన్నారు.

## చేస్తున్న అభివృద్ధి చెప్పి ఓట్లు అడుగుదాం

**- టిడిపి మండల అధ్యక్షుడు రాజగోపాల్**

**కుప్పం, అక్టోబర్ 17 ప్రభాతవార్త**



సిఎం చంద్రబాబునాయుడు అధ్వర్యం లో జరుగుతున్న అభివృద్ధి, ప్రజా సంక్షేమాలు ప్రజలకు తెలిపి ఓట్లు అడుగుదామని టిడిపి మండల అధ్యక్షుడు రాజగోపాల్ పేర్కొన్నారు. శనివారం మండలంలోని వానగుట్టపల్లి పంచాయతీలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రాబోయే స్థానిక ఎన్నికల్లో అన్ని పంచాయతీలు, ఎంపిటిసి, జడ్పీటిసి సెగ్మెంట్లలో తెదేపా అభ్యర్థుల గెలుపుకు పార్టీ నేతలు, కార్యకర్తలు పనిచేయాలని కోరారు. నేతలు, కార్యకర్తల ప్రజల సమస్యల పరిష్కారంకు చొరవ చూపాలన్నారు. ఈసందర్భంగా పలువురు తెదేపాలో చేరారు. కార్యక్రమంలో కార్పోరేషన్ డైరెక్టర్లు శరవణ, చెక్కునత్తం మణి, ప్రధాన కార్యదర్శి ధనశేఖర్, కడ సభ్యుడు రామచంద్ర, క్లస్టర్ ఇన్‌చార్జ్ శ్రీనివాసులు, యూనిట్ ఇన్‌చార్జ్‌లు శివకుమార్, దివాకర్, తెలుగుయువత అధ్యక్షుడు కనకరాజు, మాజీ సర్పంచ్ సంతోష్, స్థానిక నేతలు పాల్గొన్నారు.

## జడ్పీటిసి రేసులో సీనియర్ నేత చలపతి

**కుప్పం, అక్టోబర్ 17 ప్రభాతవార్త**



తెలుగుదేశం పార్టీలో ముప్పై ఏళ్లుగా పనిచేస్తున్న తనకు ఈదఫా కుప్పం జడ్పీటిసిగా అవకాశం కల్పించాలని మండలంలోని మిట్టపల్లికి చెందిన తెదేపా సీనియర్ నేత వి.చలపతి సిఎం చంద్రబాబునాయుడును కోరారు. పార్టీ ప్రతిపక్షంలో ఉన్న సమయంలోను పార్టీలోనే ఉన్నానని పేర్కొన్నారు. 2024 ఎన్నికల్లో బలిజ సామాజిక వర్గం ప్రజలు తెదేపాకు మద్దతుగా నిలిచేందుకు కృషి చేశానన్నారు. ఇంతవరకు బలిజ సామాజిక వర్గానికి జడ్పీటిసి అవకాశం రాలేదని ఈ దఫా తనకు అవకాశం కల్పించాలని ఆయన కోరారు.

## గొడ్డలిపార్టీ డ్రామాలు ప్రజలు గమనిస్తున్నారు

**శాంతిపురం, అక్టోబర్ 17 ప్రభాతవార్త**





గొడ్డలి పార్టీ డ్రామా రాజకీయాలను ప్రజలు గమనిస్తున్నారని మాజీ ఎమ్మెల్సీ గౌనివారి శ్రీనివాసులు, టిడిపి మండల అధ్యక్షుడు ఉదయ్ కుమార్, కార్మిక బోర్డు సభ్యుడు విశ్వనాథనాయుడు పేర్కొన్నారు. శనివారం స్థానిక తెదేపా కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. ఎంపి మిథున్‌రెడ్డి కర్ణాటకనుంచి గూండాలను దించి దౌర్జన్యాలకు పాల్పడ్డారన్నారు. అలాగే రాయచోటిలో మాజీ ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి పంజాబ్ నుంచి రౌడీలను తెచ్చి దౌర్జన్యాలు చేయడం దారుణమన్నారు. గతంలో కూడా సిఎం చంద్రబాబునాయుడును కుప్పంలో వైకాపా శ్రేణులు అడ్డుకున్నాయని అయితే సిఎం చంద్రబాబు తమకు క్రమశిక్షణ నేర్పారన్నారు. ఎంపి మిథున్‌రెడ్డి, మాజీ మంత్రి పెద్దిరెడ్డి పుంగనూరులో అరాచకాలకు పాల్పడ్డారన్నారు. బిసిల రిజర్వేషన్లను సైతం వైకాపా అడ్డుకుందన్నారు. సమావేశంలో నేతలు జనార్ధనరెడ్డి, గోపాల్, మణి, ఎల్.జయరాంరెడ్డి, చంద్ర, బసవరాజు, నామాలప్ప, గిరిధర్, చంద్ర, రాజేంద్ర, నాగరాజు, ఉయ్యాలజయరాంరెడ్డి, మంజునాథ్‌గౌడ్ పాల్గొన్నారు.

# తిరుపతి డివిజన్

## ప్రశాంతంగా ఎన్నికలు నిర్వహించుకుందాం

**– చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని**




**తిరుపతి హెల్త్, అక్టోబర్ 17 ప్రభాతవార్త**

చంద్రగిరి నియోజకవర్గంలో అన్ని పార్టీలు ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు నిర్వహించుకుందామని చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని నియోజకవర్గ ప్రజలకు పిలుపునిచ్చారు. చంద్రగిరిలో ఫ్యాక్షన్ సంస్కృతి వద్దన్నారు. శ్రీకృష్ణదేవరాయలు పాలించిన ప్రాంతం చంద్రగిరి అని, అటువంటి చంద్రగిరిని అభివృద్ధి వైపు తీసుకెళ్లాలని అన్నారు. వైసీపీ నాయకులు నన్ను చంపాలనుకున్నా నేను ఏమాత్రం భయపడలేదన్నారు. చంద్రగిరి నియోజకవర్గంలో వైసీపీ నాయకులు రెండు వారాలుగా డబ్బులు పెట్టి ప్రచారాలు చేస్తున్నారన్నారు. చంద్రబాబు వల్ల మీ కుటుంబం బాగు పడిందని, చంద్రబాబు లేకుంటే మీ పరిస్థితి ఈరోజు ఏంటని పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, మిథున్ రెడ్డిలు తెలుసుకోవాలన్నారు. బెదిరింపులకు ప్రజలు ఓటు వేయరని, ప్రజలకు మంచి చేస్తే ప్రజలే గెలిపిస్తారన్నారు. పూతలపట్టు ఎమ్మెల్యే మురళీ మోహన్ మాట్లాడుతూ మున్సిపల్ ఎన్నికలకు నామినేషన్ వేస్తే మిథున్ రెడ్డికి ఏం పని అని ఆయన నిలదీశారు. పుంగనూరు ఏమన్నా మిథున్ రెడ్డి జాగీరా? అని ప్రశ్నించారు. చట్టం నీ చుట్టం కాదన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి 94 శాతంతో స్ట్రైక్ గెలిపించారన్నారు. అధికారం కోసం దౌర్జన్యం,దాడులకు పాల్పడితే గొర్రెల పార్టీకే తగిన బుద్ధి చెబుతామని ఆయన ఈ సందర్భంగా హెచ్చరించారు. ఈ విలేకరుల సమావేశంలో తుడా చైర్మన్ డాలర్ దివాకర్ రెడ్డి తెలుగుదేశం పార్టీ నాయకులు పాల్గొన్నారు.

## కూటమి అభ్యర్థుల విజయానికి కృషి చేయండి - చినబాబు



**విజయపురం, అక్టోబరు 17 ప్రభాతవార్త:**

కూటమి అభ్యర్థుల విజయానికి కృషి చేయాలని ఎంఎస్ఎంఈ డైరెక్టర్ చినబాబు పేర్కొన్నారు. శనివారం మండల కేంద్రమైన విజయపురంలో స్థానిక సంస్థ ఎన్నికల్లో పోటీ చేసే ఆశావహుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్థానిక సంస్థ ఎన్నికల్లో ఎంపీటీసీస్థానం నుంచి పోటీ చేయు ఆశావహులు ఎంపీటీసీ పరిధి కార్యకర్తలతో చర్చించి ఒకే పేరు ఎంపిక చేసి ఇవ్వాలని సూచించారు. ఒకటి ఎక్కువ మందిపోటీ చేయువారి పేర్లను పార్టీ అధిష్టానం దృష్టికి తీసుకెళ్లి పేర్లు ప్రకటిస్తామన్నారు. మండలంలోని 9 మంది ఎంపీటీసీ స్థానాలకు 14 మంది పేర్లు, జడ్పీటీసీ స్థానానికి 9 మంది పేర్లు వచ్చాయని పార్టీ సూచనల మేరకు అభ్యర్థులను ఎంపిక చేస్తామన్నారు. బరిలో ఎవరు నిలిచినా ప్రతి ఒక్కరూ పార్టీ గెలుపు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో జిల్లా పంచాయతీరాజ్ ఛాంబర్ అధ్యక్షుడు ముద్దు ధనంజయ యాదవ్, టీడీపీ మండల అధ్యక్షుడు రమేష్‌రాజు, సింగిల్‌విండో అధ్యక్షుడు బాబుయాదవ్, నాయకులు లక్ష్మిపతిరాజు, మునిభాస్కరరాజు, బాలసుబ్రహ్మణ్యంరాజు, గజేంద్రనాయుడు, దశరథరాజు, శరవణ, మురళి, వేణుగోపాల్‌నాయుడు, రవిరాజు, సుధాకర్ రాజు పాల్గొన్నారు.

## బ్యాలెట్ బాక్సులు వచ్చేశాయి.. ఎన్నికలే తరువాయి!

**రేణిగుంట మండలానికి 200 బ్యాలెట్ బాక్సుల రాక.. అధికారుల పరిశీలన**



**రేణిగుంట, అక్టోబర్ 17, ప్రభాతవార్త:**

రేణిగుంట మండలంలో ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికల నిర్వహణకు అధికారులు సన్నద్ధమవుతున్నారు. ఎన్నికల ఏర్పాట్లలో భాగంగా శనివారం మండలానికి 200 బ్యాలెట్ బాక్సులు చేరుకున్నాయి. వీటిని ఎంపీడీవో రవిచంద్ర, డిప్యూటీ ఎంపీడీవో ప్రభురావు, ఇతర అధికారులు పరిశీలించారు. మండలంలోని ఎన్నికల పోలింగ్ కేంద్రాలకు 140 బ్యాలెట్ బాక్సులు అవసరమని ఎంపీడీవో రవిచంద్ర తెలిపారు. మిగిలిన 60 బాక్సులను ప్రత్యామ్నాయ అవసరాల కోసం అందుబాటులో ఉంచనున్నట్లు తెలిపారు. ఎంపిక చేసిన బాక్సుల్లో ఏవైనా సాంకేతిక లేదా ఇతర ఇబ్బందులు తలెత్తితే ప్రత్యామ్నాయ బాక్సులను వినియోగిస్తామని వివరించారు.ఎన్నికల తేదీ సమీపించే వరకు బ్యాలెట్ బాక్సులను భద్రంగా ఉంచేందుకు అవసరమైన జాగ్రత్తలు తీసుకుంటున్నామని, బాక్సులకు తుప్పు పట్టకుండా తగిన చర్యలు చేపడుతున్నామని తెలిపారు. ఎన్నికలను పకడ్బందీగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్లు వెల్లడించారు.ఎన్నికల సమయంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు, దౌర్జన్యాలకు తావు లేకుండా రెవెన్యూ, పోలీసు అధికారులతో సమన్వయం చేసుకుంటూ ముందస్తు చర్యలు చేపడుతున్నామని ఎంపీడీవో తెలిపారు.

## ఆధునిక సాంకేతికతతో భుజం మార్పిడి శస్త్రచికిత్సలు

**– సీటీ స్కాన్ ఆధారంగా రోగికి ప్రత్యేకంగా ఇంప్లాంట్ ఏర్పాటు : అపోలో వైద్యులు**




**తిరుపతి హెల్త్, అక్టోబర్ 17, ప్రభాతవార్త**

భుజాల నొప్పితో బాధపడుతూ నిత్యజీవిత కార్యకలాపాలు చేసుకోవడానికి ఇబ్బందులు పడుతున్న రోగులకు ఆధునిక వైద్య సాంకేతికతతో మెరుగైన చికిత్స అందుబాటులోకి వచ్చిందని చెన్నైలోని అపోలో ఆసుపత్రి వైద్యులు తెలిపారు. ముఖ్యంగా భుజం కీళ్ల అరుగుదల, పాత గాయాలు, ఎముకల విరుగుడు కారణంగా శస్త్రచికిత్స విఫలమైన సందర్భాలు, భుజం చుట్టూ ఉండే కండరాలు దెబ్బతిన్న రోగులకు ఆధునిక రివర్స్ షోల్డర్ ఆర్థ్రోప్లాస్టీ విధానం ఉపయోగకరంగా ఉంటుందని వివరించారు. అపోలో ఆసుపత్రికి చెందిన ఆర్థోపెడిక్ వైద్య బృందం ప్రతి నెలా నిర్వహిస్తున్న వైద్య శిబిరంలో భాగంగా ఈ ఆధునిక చికిత్సా విధానంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా అసోసియేట్ కన్సల్టెంట్ ఆర్థోపెడిక్ సర్జన్ డాక్టర్ ప్రవీణ్ మాట్లాడుతూ భుజం నొప్పితో బాధపడేవారు తల దువ్వుకోవడం, దుస్తులు మార్చుకోవడం, పైకి చేతులు ఎత్తడం వంటి సాధారణ పనులు చేసుకోవడానికి కూడా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. ముఖ్యంగా వృద్ధుల్లో భుజం కీళ్ల అరుగుదల, కండరాలు దెబ్బతినడం వంటి సమస్యలు ఎక్కువగా కనిపిస్తాయని పేర్కొన్నారు. సీటీ స్కాన్ ఆధారంగా ప్రత్యేక ప్రణాళిక రివర్స్ షోల్డర్ ఆర్థ్రోప్లాస్టీ శస్త్రచికిత్సలో భాగంగా ముందుగా రోగికి సీటీ స్కాన్ నిర్వహించి, భుజం ఎముకల నిర్మాణాన్ని పరిశీలిస్తారని డాక్టర్ ప్రవీణ్ తెలిపారు. అనంతరం రోగి శరీర నిర్మాణానికి అనుగుణంగా ప్రత్యేక చికిత్సా ప్రణాళిక రూపొందించి, తగిన ఇంప్లాంట్‌ను ఎంపిక చేస్తారని వివరించారు. ఈ సాంకేతికత ద్వారా శస్త్రచికిత్సకు ముందే ఎముకల నిర్మాణం, ఇంప్లాంట్ అమరికకు సంబంధించిన అంశాలను అంచనా వేయవచ్చని తెలిపారు. దీనివల్ల శస్త్రచికిత్సను మరింత కచ్చితత్వంతో నిర్వహించేందుకు సహాయపడుతుందని వివరించారు.

**చిత్తూరుకు చెందిన మహిళకు విజయవంతమైన చికిత్స**

ఈ సందర్భంగా చిత్తూరుకు చెందిన ఒక మహిళకు నిర్వహించిన శస్త్రచికిత్స వివరాలను వైద్యులు వెల్లడించారు. ఆమె రెండు భుజాల కీళ్లు తీవ్రంగా అరిగిపోవడంతో చేతులను పైకి ఎత్తలేక, దుస్తులు మార్చుకోవడం, తల దువ్వుకోవడం వంటి పనులు చేసుకోవడానికి సుమారు పదేళ్లుగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు తెలిపారు. ఆమెకు తొలుత ఎడమ భుజానికి పది నెలల క్రితం, అనంతరం కుడి భుజానికి నెల రోజుల క్రితం శస్త్రచికిత్స నిర్వహించినట్లు వివరించారు. శస్త్రచికిత్సకు ముందు, అనంతరం తీసిన ఎక్స్‌రే చిత్రాలను ప్రదర్శిస్తూ చికిత్సా ఫలితాలను వివరించారు. శస్త్రచికిత్స అనంతరం ఆమె రెండు చేతులను పైకి ఎత్తగలుగుతున్నారని తెలిపారు. ఎంపిక చేసిన రోగులు శస్త్రచికిత్స అనంతరం తక్కువ సమయంలోనే నడవగలగడం, 24 గంటల్లోపు ఆసుపత్రి నుంచి డిశ్చార్జి కావడం సాధ్యమవుతుందని వివరించారు. చెన్నైలోని అపోలో ఆసుపత్రి గ్రీమ్స్ రోడ్ శాఖలో ఈ ఆధునిక చికిత్సా విధానాన్ని అందిస్తున్నట్లు వైద్యులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్థోపెడిక్ వైద్య బృందానికి చెందిన డాక్టర్ ప్రవీణ్, డాక్టర్ కార్తీక్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## నాగలాపురంలో జడ్పీటీసీ, ఎంపీటీసీ ఆశావహుల పేర్ల సేకరణ

**– పార్టీ కోసం కష్టపడిన కార్యకర్తలకే బీ ఫారాలకు ప్రాధాన్యం**

**నాగలాపురం, అక్టోబరు 17 ప్రభాతవార్త:**



నాగలాపురం మండలంలో రానున్న స్థానిక సంస్థల ఎన్నికల సందడి మొదలైంది. జడ్పీటీసీ, ఎంపీటీసీ, ఎంపీపీ స్థానాలకు పోటీ చేయాలనుకునే ఆశావహుల పేర్ల సేకరణలో భాగంగా శనివారం నాగలాపురంలోని టీఆర్ఆర్ కల్యాణ మండపం వద్ద తెలుగుదేశం పార్టీ కుటుంబ సభ్యులు, కూటమి నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ పంచాయతీలకు చెందిన ఆశావహులు తమ పేర్లను నాగలాపురం మండల టీడీపీ అధ్యక్షుడు టీజేబీ ప్రణీత్‌రెడ్డికి అందజేశారు. ఆశావహుల అభిప్రాయాలను పరిగణలోకి తీసుకుని, పేర్ల జాబితాను పార్టీ అధిష్టానానికి పంపిస్తామని, అధిష్టానం పరిశీలన అనంతరం తుది నిర్ణయం ఉంటుందని ఆయన వెల్లడించారు. గత ఐదేళ్ళ ప్రతిపక్ష కాలంలో పార్టీ కోసం కష్టపడి పనిచేసిన కార్యకర్తల సేవలను గుర్తిస్తామని, కేసులను సైతం ఎదుర్కొని పార్టీకి అండగా నిలిచిన వారికి ప్రాధాన్యత కల్పించే దిశగా నిర్ణయాలు ఉంటాయని ప్రణీత్‌రెడ్డి పేర్కొన్నారు. బీ ఫారాల కేటాయింపుపై పార్టీ అధిష్టానమే తుది నిర్ణయం తీసుకుంటుందని స్పష్టం చేశారు. పార్టీ నిర్ణయానికి కట్టుబడి ఐక్యంగా ముందుకు సాగితేనే ఎన్నికల్లో మెరుగైన ఫలితాలు సాధించగలమని అభిప్రాయపడ్డారు. సీనియర్ నాయకులు, ఏఎంసీ చైర్మన్ దామోధరం, మొదలియార్ కార్పొరేషన్ డైరెక్టర్ నమఃశివాయం, ఎంపీటీసీ ప్రేమసెల్వకుమార్, పీఏసీఎస్ డైరెక్టర్లు, క్లస్టర్ ఇన్‌చార్జి శ్రీనివాసయాదవ్, ఎం.డి.కుమార్, యువ నాయకులు, మహిళా కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## టీడీపీకి షాక్.. వైసీపీలోకి చంద్ర యాదవ్ చేరిక

**మాజీ ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి సమక్షంలో పార్టీలో చేరిన టీడీపీ సీనియర్ నాయకుడు**



**రేణిగుంట, అక్టోబర్ 17, ప్రభాతవార్త:**

రేణిగుంట మండలం ఆర్.మల్లవరం పంచాయతీకి చెందిన టీడీపీ సీనియర్ నాయకుడు చంద్ర యాదవ్ తన అనుచరులతో కలిసి శనివారం వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలో చేరారు. శ్రీకాళహస్తి పట్టణంలోని వైసీపీ కార్యాలయంలో మాజీ ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి, డీసీసీబీ మాజీ చైర్మన్ సిద్ధాగుంట సుధాకర్‌రెడ్డి, మాజీ ఎంపీపీ అత్తూరు హరిప్రసాద్‌రెడ్డి సమక్షంలో ఆయన వైసీపీ కండువా కప్పుకుని పార్టీలో చేరారు. ఈ సందర్భంగా చంద్ర యాదవ్‌తో పాటు ఆయన అనుచరులకు పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. టీడీపీకి చెందిన సీనియర్ నాయకుడు తన అనుచరులతో కలిసి వైసీపీలో చేరడం స్థానిక రాజకీయాల్లో ప్రాధాన్యత సంతరించుకుంది.

## ఆకట్టుకున్న దసరా బొమ్మల కొలువు



**తిరుపతి,అక్టోబర్ 17 ప్రభాతవార్త:**

తిరుపతి బండ్ల వీదిలో తిప్పారెడ్డి నివాసంలో కుటుంబ సభ్యులు ఏర్పాటుచేసిన దసరా బొమ్మలకొలువు అబిమానులను, నగరవాసులను ఆకట్టుకుంది. మునస్వామి రెడ్డి, చంద్రశేఖర్ రెడ్డి, ధనలక్ష్మి ్మ, విశ్రాంత ఏఈఓకోమలమ్మ, శిరీష, సుశీలమ్మ, తదితరులు గత 60 సంవత్సరాలుగా భాగవతంలోని ఘట్టాలు తెలియపరుస్తూ బొమ్మల కొలువు ఏర్పాటు చేస్తున్నారు దసరా సంబరాలలో ముఖ్యంగా ఏర్పాటు చేసే

బొమ్మల కొలువు ఒక సమాచార దృశ్య వేదిక.ఇది గతం లో నాటికలు, సినిమాలకు పూర్వం ఇదే ప్రముఖ పాత్ర పోషించింది. రకరకాల అంశం లపై వివిధ బొమ్మల తో రూపక ఘట్టం లను చూపించే ఆలోచింప జేసే ప్రక్రియే బొమ్మలకొలువు ముఖ్య ఉద్దేశం. బొమ్మల కొలువును వీక్షి ంచి ప్రతి ఒక్కరూ ఈ బొమ్మల కొలువు దసరా వరకు ఉంటుందని, చిన్న పెద్ద అందరూ వచ్చి ఈ బొమ్మల కొలువును వీక్షి ంచవలసినదిగా తెలియజేశారు. ఈ సందర్భంగా నిర్వాహకులను రాయలసీమ రంగస్థలం చైర్మన్ గుండాల గోపీనాథ్‌రెడ్డి, సభ్యులు వాసుదేవ రెడ్డి, నటరాజిరెడ్డి, విద్వాన్ కస్పా పద్మనాభం, మురళి, చిత్రపు హనుమంతరావు, తొండమనాటి సుబ్రహ్మణ్యం రెడ్డి, అభినందించారు.

## రాయలసీమ అంతటా అమరా ప్రథమ స్పందన శిక్షణ కార్యక్రమాల విస్తరణ




**రేణిగుంట అక్టోబర్ 17 ప్రభాతవార్త.**

ప్రపంచ ట్రామా దినోత్సవం సందర్భంగా గాయాల నివారణ, అత్యవసర పరిస్థితుల్లో ప్రాణాలను కాపాడటం, సకాలంలో వైద్య సహాయం అందించడంపై అవగాహన కల్పించేందుకు రేణిగుంట లోని అమరా ఆసుపత్రి ట్రామా, అత్యవసర వైద్య విభాగం ఆధ్వర్యంలో రాయలసీమ అంతటా అమరా ప్రథమ స్పందన శిక్షణ కార్యక్రమాలను విస్తరిస్తున్నారు. ప్రస్తుతం ప్రతి వారం రెండు నుంచి మూడు శిక్షణ కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. ఆసుపత్రి చైర్మన్ డాక్టర్ ప్రసాద్ గౌరినేని మాట్లాడుతూ, ప్రమాదాలు, తీవ్రమైన గాయాల సమయంలో సకాలంలో స్పందించడం ప్రాణాలను కాపాడటంలో కీలకమని, ప్రజల్లో అవగాహనతో పాటు అత్యవసర వైద్య సేవలపై సంసిద్ధత పెరగాలని తెలిపారు. విభాగం డైరెక్టర్ డాక్టర్ తమోరిష్ కోలే మాట్లాడుతూ, వైద్య బృందాలు చేరుకునేలోపు ప్రాథమిక సహాయం అందించేందుకు ప్రజలకు శిక్షణ ఇస్తున్నామని పేర్కొన్నారు. రక్తస్రావం నియంత్రణ, గాయపడిన భాగాలను స్థిరపరచడం, గుండె, శ్వాస పునరుద్ధరణ ప్రక్రియ, అందుబాటులో ఉన్న వస్తువులతో ప్రాథమిక చికిత్స అందించడం వంటి అంశాల్లో శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. వైద్య సిబ్బందికి గాయాల నిర్వహణ, పునరుజ్జీవన చికిత్సలో అధునాతన శిక్షణతో పాటు సాధారణ ప్రజలు, డ్రైవర్లకు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు వివరించారు. ట్రామా, అత్యవసర సాధారణ శస్త్రచికిత్స విభాగాధిపతి డాక్టర్ సురేష్ ఖన్నా మాట్లాడుతూ, గాయాల సమయంలో వేగంగా, సరైన విధంగా స్పందించడం ప్రాణరక్షణకు దోహదపడుతుందని, వైద్య సహాయం పొందడంలో ఆలస్యం చేయకూడదని సూచించారు.రోడ్లు, ఇళ్లు, కార్యాలయాల్లో భద్రతా చర్యలు పాటిస్తూ గాయాలను నివారించాలని, ప్రథమ చికిత్సపై అవగాహన పెంచుకోవాలని అమరా ట్రామా, అత్యవసర వైద్య విభాగం ప్రజలకు పిలుపునిచ్చింది. అమరా ఆసుపత్రిలో పనిచేస్తున్న ఈ విభాగం అత్యున్నత స్థాయి ట్రామా కేంద్రంగా అత్యవసర వైద్య సేవలు అందించడంతో పాటు, ప్రథమ స్పందన శిక్షణ ద్వారా రాయలసీమలో అత్యవసర పరిస్థితులను ఎదుర్కొనే సామర్థ్యాన్ని పెంపొందించేందుకు కృషి చేస్తోంది. కార్యక్రమంలో తిరుపతి రీజినల్ ట్రాన్స్‌పోర్ట్ ఆఫీసర్ మురళీకృష్ణ, రవాణా శాఖ అధికారి సుబ్రహ్మణ్యం, మోటార్ వెహికల్ ఇన్స్పెక్టర్లు, అసిస్టెంట్ ఇన్స్పెక్టర్లు పాల్గొన్నారు.

## కలెక్టరేట్లో పిజిఆర్ఎస్ రద్దు

**తిరుపతి కలెక్టరేట్, అక్టోబర్ 17 ప్రభాతవార్త:**

స్థానిక సంస్థల ఎన్నికలు, మహర్నవమి పండుగ సందర్భంగా ప్రభుత్వ సెలవు ఉన్నందున తిరుపతి కలెక్టరేట్ లో సోమవారం నిర్వహించే ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని రద్దు చేసినట్లు జిల్లా కలెక్టర్ డా. ఎస్. వేంకటేశ్వర్ శనివారం తెలిపారు. ఈ విషయాన్ని జిల్లా ప్రజలు గమనించాలన్నారు. అర్జీలు ఇచ్చేందుకు కలెక్టరేట్ కు ఎవరూ రాకూడదని తెలిపారు. క్షేత్రస్థాయిలో కూడా పీజీఆర్ఎస్ నిర్వహించడం జరగదని తెలిపారు.

## మహాలక్ష్మిగా గంగమ్మ దర్శనం



**తిరుపతి,అక్టోబర్ 17 ప్రభాతవార్త:**

తిరుపతినగరంలో వెలసిన తాతయ్యగుంట గంగమ్మఆలయంలో నవరాత్రి బ్రహ్మోత్సవాల్లో శనివారం సాయంత్రం అమ్మవారిని మహాలక్ష్మిదేవిగా అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. నవరాత్రి బ్రహ్మోత్సవాలు అంగరంగ వైభవంగా ఆలయంలో జరుగుతున్నాయి. ఆలయంలో ఉదయంనుండి భక్తులకు దర్శనం కల్పించి ప్రసాదవితరణచేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ పాలకమండలి ఛైర్మన్ నైనార్ మహేశ్‌యాదవ్ ఆధ్వర్యంలో ఈఓ జయకుమార్ భక్తులకు సకల సౌకర్యాలు కల్పించారు.

## ప్రజలు ఓటు ద్వారా వైసిపిని నాయకులను తరిమికొట్టండి

**– నగిరి ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్**



**తిరుపతి హెల్త్, అక్టోబర్ 17 ప్రభాతవార్త**

ప్రజలు తమ ఓటు హక్కుతో వైసీపీ పార్టీ నాయకులను తరిమి కొట్టాలని నగిరి ఎమ్మెల్యే గాలి భాను ప్రకాష్ ప్రజలకు పిలుపు నిచ్చారు. శనివారం తిరుపతి ప్రెస్ క్లబ్‌లో జరిగిన విలేకరుల సమా వేశంలో ఆయన మాట్లాడారు. వైసిపి నాయకులు దౌర్జన్యాలు, రౌడీయిజంతో రాజకీయాలు చేస్తూ ప్రజలను మభ్యపెడుతున్నారని ఆయన మండిపడ్డారు. వైసీపీ నాయకులు ప్రజా సమస్యలపై పోరాడాలని హితవు పలికారు. రాజధాని విషయంలో మావిగన్ పేరుతో వెటకారం చేస్తున్నారన్నారు. రోజా ఒక తాటి మట్ట అని అర్థం పర్థం, సంబంధం లేకుండా రాజకీ యాలు మాట్లాడు తుందని విమర్శించారు. వైసీపీ పార్టీకి ప్రజలు 11 సీట్లకే పరి మితం చేసిన ఇంకా వారికి బుద్ధి రాలేదన్నారు. ప్రతిపక్ష హోదా కావాలంటే ప్రజలు ఇవ్వాలని, పార్టీలు కాదన్నారు. పుంగనూరు, రాయచోటి ప్రాంతాలలో వైసీపీ నాయకుల అరాచకాలు తానెప్పుడూ చూడ లేదని, నామినేషన్ వేయడానికి కాన్వాయ్ కావాలా అని మిథున్ రెడ్డిని ప్రశ్నించారు. నామినేషన్

## శివరాజు మృతి పార్టీకి తీరని లోటు - కుమారస్వామిరెడ్డి



**విజయపురం, అక్టోబరు 17 ప్రభాతవార్త:**

విజయపురం మండల వైసీపీ పార్టీ కన్వీనర్ గుంటు మడుగు శివరాజు అకాల మరణం పార్టీకి తీరనిలోటని మాజీ మంత్రి రోజా సోదరుడు వై.కుమారస్వామిరెడ్డి పేర్కొన్నారు. శివరాజు ఇటీవల బైక్‌పై వెళుతూ ప్రమాదం జరిగింది. తిరుపతిలో ఒక ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందారు. ఈ సందర్భంగా వారి స్వగృహం విజయపురంలో శనివారం మాజీమంత్రి సోదరుడు కుమారస్వామి రెడ్డి శివరాజు మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించి, కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఆయనతో పాటు పార్టీ నాయకులు మంజు బాలాజీ, రామకృష్ణంరాజు, గుణశేఖర్‌రెడ్డి, శేఖర్‌రాజు, కె.వి.రాజు, జ్యోతివర్మ తదితరులు పాల్గొన్నారు.

# టికెట్ ఇస్తే పార్టీకి..... కాదంటే స్వతంత్రం...!

**రైల్వే కోడూరు, అక్టోబర్, 17 ప్రభాతవార్త**

స్థానిక సంస్థల ఎన్నికలు నియోజకవర్గంలో బాగా ఊపందు కున్నాయి. పోటీలో నిలిచేందుకు అందరిలోను ఆశలు చెలరేగుతున్నాయి. దీంతో అన్నిపార్టీలలోనూ ఒక స్థాయి క్రెజున్ననాయకులు కార్యకర్తలు కాకుండా పార్టీపట్ల ఆసక్తి ఉన్న కొందరు చిన్నపాటి కార్యకర్తలు పోటీకి తపన పడుతున్నారు. వీరి ఆశలు ఇలా ఉంటే కూటమి పార్టీ లోనూ, వైసీపీ పార్టీలోనూ సాదా సీదా కార్యకర్తలైతే నియోజకవర్గం లోని ఇంచార్జిలు అయినటువంటి అధిష్టానం నాయకులను డోంట్ కేర్ అంటూ తాము ఆశించిన మేరకు పార్టీ టికెట్లు ఇస్తే పోటీ చేస్తాం లేదంటే ఇండిపెండెంట్‌గా పోటీచేసి బరిలో దిగుతామని హెచ్చరిస్తున్నారు. ఆయా పార్టీలకు సంబంధించి మేమే అభ్యర్థులం అంటూ గ్రూప్ లో ఫొటోలు పెట్టి పార్టీ పేర్లను గుర్తులను ప్రజలకు పోస్టులు చేస్తు న్నారు. వీరి పరిస్థితే ఇలా ఉంటే.. ఇక మండలాలలోనూ, పంచాయతీ లలోనూ ఏళ్ల తరబడి రాజకీయాలు చేస్తూ ఈ పల్లెలన్నీ మావే మేము చెప్పిందే వింటారు. మేము చేసిందే శాసనం అని చెప్పుకుంటున్న సీనియర్ నాయకులు, కార్యకర్తల పరిస్థితి ఏమిటన్నది. నిన్నటి వరకు ఓటర్లగా వున్న వీరు ఈ స్థానిక సంస్థల ఎన్నికలకు మేము ఎన్నికలలో దిగబోయే అభ్యర్థులం అంటున్నారంటే నాయకులకు సీనియర్ కార్యకర్తలకు వీరి వ్యవహారం మింగుడు పడని పరిస్థితి. గతంలో టిక్కెట్లు ఆశించాలంటే అన్ని ఆర్థిక

## బెదిరింపులకు దిగుతున్న కొందరు చిన్నపాటి కార్యకర్తలు

బలం పార్టీ అండ గ్రామాల్లో జనబలం ఉన్న వారు నిలబడాలంటే ఆలోచించే వారు. వారికోసం పార్టీల అధినాయకులు రాత్రింబవళ్ళు వాళ్ళ ఇళ్ల చుట్టూ తిరిగి ఒప్పించేందుకు నాన తంటాలు పడేవారు. అప్పట్లో అసలు నాయకులు ఈ పదవులు కోసం అంత ఆరాటపడ వారు కూడా కాదు. అయితే 2006నుంచి ఎమ్మెల్యే స్థాయి నాయకులే సర్పంచ్ మొదలుకొని ఎంపి.పి, జెడ్. పి. టి. సి. అవసరమైతే జిల్లా పరిషత్ చైర్మన్ స్థానం కూడా తన ఇంట్లోనే ఉండాలి. ఎందుకంటే నియోజకవర్గం లో ఎమ్మెల్యే, ఇంచార్జి లు చేసింది చెప్పిందే శాసనం. ఇదే పద్ధతి రైల్వే కోడూరు నియోజకవర్గం లో అన్ని నియోజకవర్గాలవలే జరుగుతుంది. ప్రస్తుత ఎన్నికలలో కూడా అన్ని పార్టీల నాయకులు ఇదే విధానాన్నే అవలంబిస్తున్నట్లు తెలుస్తుంది. గతంలో నాయకులను చూస్తే మంచి గౌరవం ఇచ్చే వారు. అయితే ప్రస్తుతం జరిగే స్థానిక సంస్థల ఎన్నికల పరిస్థితి చూస్తే ఎదో తిరునాళ్ళు చూసేందుకు పిల్లలు పెద్దలు ఎగబడినట్లు మాకు టిక్కెట్ మేము పోటీ చేస్తామని కొందరు చిన్నపాటి కారక్యకర్తలు ఎగబడడం చూస్తుంటే ఆధినాయకుల అశ్చర్యం అంతా ఇంతా కాదు. దీన్ని బట్టి చూస్తుంటే ఆ పదవుల్లో అధికంగా అక్రమ అదాయాలు ఉన్నాయనా లేదా నాయకులు వీరిపట్ల అభివృద్ధి మరచి సరైన పాలన అందించలేదని అందరు ఎగబడుతున్నారా అన్నది అంతు బట్టని సమస్య. ఇదిలా ఉంటేకూటమిలో అధికంగా అభ్యర్థులు పుట్టగొడుగులా లేస్తుంటే, వైసీపీ పార్టీలో సాదా సీదా కార్యకర్తలు అంతో ఇంతో ముందుకొస్తుంటే, మండలనాయకులు ఈ అభ్యర్థుల సమస్య ఎక్కడ మా మెడకు చుట్టు కొంటుందోనని ఎవరినైనా బరిలో దింపి ఎన్నికలు జరిపామని చేతులు దులుపుకొనే పరిస్థితి లో ఉన్నట్లు తెలుస్తుంది. అయితే వీరు తప్పించుకొనేందుకు అవకాశం లేకుండా ఎం. పి. మిథున్ రెడ్డి, నియోజకవర్గం ఇంచార్జి మాజీ ఎమ్మెల్యే కొరముట్ల శ్రీనువాసులు అన్ని మండలాలలో మండల కన్వీనర్ లనే రంగంలో దించి మిగిలిన అభ్యర్థులకు భరోసా ధైర్యాన్ని నింపే విదంగా పావులు కదుపుతున్నట్లు తెలుస్తుంది. వీరి పరిస్థితి ఇలా ఉంటే బి. జె. పి. గతంలో పోటీ చేసేందుకు అభ్యర్థులు దొరకని పరిస్థితి అలాంటిది మూడు పార్టీలు కూటమిగా ఏర్పడడంతో అన్ని చోట్ల అభ్యర్థులు పోటీలో దిగేందుకు పోటీ పడడమే కాకుండా ప్రధాన మైన మండల అధ్యక్ష పదవులు, జెడ్.పి. టి.సి.ల స్థానాలు ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నట్లు తెలుస్తుంది.

# శ్రీకాళహస్తి డివిజన్

### శ్రీకాళహస్తి ఆర్‌టిసి బస్టాండులో...

## సెల్ ఫోన్లు వరస చోరీలు

### -మౌన ముద్రలో పోలీసు అవుట్ పోస్టు సిబ్బంది
### -సిసి కెమెరాలు పనియని వైనం
### -సెల్ ఫోన్లు చోరీలకు అడ్డగా శ్రీకాళహస్తి బస్టాండు

తొట్టంబేడు,అక్టోబర్ 17 ప్రభాతవార్త: శ్రీకాళహస్తి ఆర్‌టిసి బస్టాండులో విద్యార్థులకు సంబంధించిన రెండు సెల్‌ఫోన్లు చోరీ జరిగినట్లు టూటౌన్ ఎస్ఐ జ్యోతికి ఫిర్యాదు అందింది. శనివారం రాత్రి జరిగిన సంఘటనకు సంబంధించి పీలేరుకు మోహిత్‌రెడ్డి, ఫారూఖ్‌లు పోలీసులకు ఫిర్యాదు చేసారు. సెల్ ఫోన్లు చోరీ అనేవి గత కొన్ని సంవత్సరాలుగా జరుగుతున్నాయి. శ్రీకాళహస్తి బస్టాండులో నాయుడుపేట బస్టాప్‌లో ఇది ఎక్కువగా వున్నాయి. పీలేరుకు చెందిన విద్యార్థులు తమిళనాడులోని గుమ్మడిపూడిలోని ఆర్ఎంకె కళాశాలలో ఇంజనీరింగ్ చదువుతున్నారు. దసరా సెలవులకు తమ స్వగ్రామానికి వెళ్ళటానికి శ్రీకాళహస్తి ఆర్‌టిసి బస్టాండులో దిగారు. ఇక్కడ పీలేరుకు వెళ్ళటానికి తిరుపతి బస్సులో ఎక్కడానికి ప్రయత్నించారు.ఈ నేపథ్యంలో బస్సు ఎక్కిన తరువాత జేబుల్లోని సెల్ ఫోన్లు మాయమైనట్టు గుర్తించారు. ఇద్దరి జేబుల్లో యాపిల్ సెల్‌ఫోన్లు మాయమైనట్లు గుర్తించి వెతుక్కోగా చోరీ జరిగినట్లు గుర్తించారు. దాంతో లబోదిబో మంటూ చుట్టుపక్కల పరిశీలించారు. వాటి విలువ సుమారు రూ.లక్ష ఉంటుందని పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు. దాంతో టూటౌన్ పోలీసులకు ఫిర్యాదు చేసారు.

**పని చేయని సిసి కెమెరాలు, పట్టించుకోని ఆర్టీసి అధికారులు, పోలీసులు**

శ్రీకాళహస్తి ఆర్‌టిసి బస్టాండులో భద్రత ప్రశ్నార్థకంగా మారింది. ఇక్కడ సిసి కెమెరాలు ఉన్నాయి. కానీ అవి పని చేయవు.ఇక ఇక్కడ సెక్యూరిటి లేదు. పోలీసు భద్రత లేదు. ఏదైనా జరిగితే పోలీసుల వచ్చే వరకు అంతా జరిగి పోయిందనట్లు మారుతుంది. సుమారు 11 ఎకరాల విస్తీర్ణంలో ఉన్న బస్టాండులో ఎప్పుడు ఏం జరుగుతుందో అంతుపట్టని పరిస్థితి చోటు చేసుకుంది. గతంలో కకూడా ఎన్నో సంఘటనలు జరుగుతున్నా ఆర్‌టిసి కానీ పోలీసులు కానీ పకడ్బందిగా చర్యలు తీసుకోవటం లేదు. చోరీలు,దాడులు జరిగినపుడు పోలీసులు కేసులు నమోదు చేసి చేతులు దులుపుకుంటారు. ఆర్‌టిసి అధికారులు అసలు పట్టించుకోరు. దాంతో పరిస్థితి అగమ్యగోచరంగా మారింది.

## ఆకట్టుకుంటున్న వాసవి అమ్మవారి అలంకారం




శ్రీకాళహస్తి,అక్టోబర్ 17 ప్రభాతవార్త: శ్రీకాళహస్తిలోని శ్రీ వాసవి కన్యకాపరమేశ్వరి ఆలయాల్లో దసరా ఉత్సవాల సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక ఆలంకారాలు ఆకట్టుకుంటున్నాయి. ఈ నేపథ్యంలో శనివారం రాత్రి పట్టణంలోని బజారువీదిలో వెలసిన శ్రీ వాసవి అమ్మవారి ఆలయంలో మూలవిరాట్టుకు కోల్హాపూర్ మహాలక్ష్మి అలంకారం నిర్వహించారు. ఈ అలంకారాల కోసం తమిళనాడు నుంచి ప్రత్యేక నిపుణులను రప్పించారు. ఉభయదారులుగా గాధంశెట్టి సునీల్, సోలేపల్లి ప్రసాద్, రాచపూటి బద్రినారాయణ గుప్తా పొట్టి నాగశంకర్ గుప్తా, అమరా వెంకటరమణయ్య, శెట్టి, బొమ్మిశెట్టి బాలాజి,మండల ఆనంద్ ప్రభు గుప్తా(సూర్యహోటల్) రాజాసాయి కిషోర్,కశ్శెటి రాంబాబు, ఊటూకూరు రమేష్‌బాబులు వ్యవహరించారు.

### నిను ఏమని పొగడుదుమో...!

## వీధులవీధుల ఆడరో జనులు

ప్రభాతవార్తప్రతినిధి-తిరుమల:



తనను శరణు జొచ్చిన భక్తులపాలిట ఆపదమొక్కులవాడుగా...అనాధరక్షకుడుగా కీర్తింపబడుతున్న ఏడుకొండల శ్రీవేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాల్లో ఆలయ నాలుగుమాఢవీధుల్లో భక్తితో సేవకులైన జనులు తమకు తోచినరీతిలో ఆడిపాడారు. దేశంలోని వివిధ రాష్ట్రాలనుండి వచ్చిన కళాకారులు తమ ప్రదర్శనలతో భక్తులను ఆకట్టుకున్నారు. అప్సరసలే ఆనాడు పాలసముద్రంలో శ్రీమహావిష్ణువును తమ నాట్యభంగిమలతో ప్రసన్నంచేసుకున్నారు. ఈ రీతిలో నేడు భక్తితో జనులు తమకు తోచిన కళాప్రదర్శనలు అద్భుతంగా ప్రదర్శిస్తున్నారు. స్వామివారి చెంత మేమూ సేవకులమేనంటూ ఆనంద పరవశులవుతున్నారు. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, ఉత్తరప్రదేశ్, కర్నాటక, జమ్మూ కాశ్మీర్, జార్ఖండ్, అస్సాం, పశ్చిమ బెంగాల్, ఢిల్లీ, అరుణాచల్ ప్రదేశ్, సిక్కిం, కేరళ, తమిళనాడు, రాజస్థాన్ రాష్ట్రాల సంప్రదాయ నృత్యాలు, జానపద కళారూపాలు, గాన, వాద్య ప్రదర్శనలు మాడ వీధుల్లో ఆధ్యాత్మిక, సాంస్కృతిక శోభను నింపాయి. కళాకారుల ప్రదర్శనలను భక్తులు ఆసక్తిగా తిలకించారు.

### జోరువానలోనూ సంతృప్తికర సౌకర్యాలతో

## భక్తుల పరవశం

### శ్రీవారిసేవకుల...పోలీసుల...ఉద్యోగుల సేవలు అభినందనీయం



తిరుమల,అక్టోబర్ 17 ప్రభాతవార్తప్రతినిధి: ప్రతిరోజూ 90వేలనుండి లక్షమంది భక్తులు వస్తున్న తిరుమల కొండపై 3లక్షల మందికి సేవలుచేయడం టిటిడికి పెద్ద క్లిష్టమైన సమస్యకాదు.... అయినా ఓ వైపు జోరువాన మరోవైపు గ్యాలరీల్లో అశేషభక్తులు గరుడసేవ వీక్షణకు విచ్చేశారు. భక్తులకు నిరంతరాయంగా అన్నప్రసాదాలు, తాగునీరు, మజ్జిగ,టీ పంపిణీ చేయడం మాటలు కాదు. ఇదంతా రెండువారాలు క్రిందట నుండి పోలీసు,టిటిడిలోని అన్ని విభాగాలు సమన్వయం సమష్టి కృషితోనే సాధ్యమైంది. బ్రహ్మోత్సవాలలో అత్యంత ప్రధానమైన గరుడవాహనసేవను దాదాపు 3లక్షమంది భక్తులు ప్రశాంతంగా వీక్షించేలా సౌకర్యాలు కల్పించి,భక్తుల పరవశం వెనుక కృషిచేసిన పోలీసు, టిటిడి, విజిలెన్స్, శ్రీవారి సేవకులు, ఆలయం ఉద్యోగుల పనితీరును టిటిడి ఈఓ ముద్దాడ రవిచంద్ర, అదనపు ఈఓ చిరుమామిళ్ళ వెంకయ్యచౌదరి, తిరుపతి జిల్లా ఎస్పీ లంకెల సుబ్బరాయుడు, సివిఎస్ఓ మురళీకృష్ణ సంతృప్తి చెందారు.భక్తులు వీరిని ప్రత్యేకంగా అభినందించారు. జోరువాన లోనూ గరుడవాహనసేవ జరిగినా చిన్నపాటి అవాంఛనీయ సంఘటనలు తలెత్తకుండా, పూర్తిస్థాయిలో భద్రత, అన్నప్రసాదాల పంపిణీ తదితర సేవలందించి భక్తుల మన్ననలు అందుకున్నారు..

## ఎన్నికల సాధారణ, వ్యయ పరిశీలకుల రాక!

తిరుపతి కలెక్టరేట్, అక్టోబర్ 17 ప్రభాతవార్త: జిల్లాలో నిర్వహిస్తున్న మున్సిపల్ ఎన్నికల పర్యవేక్షణకు రాష్ట్ర ఎన్నికల సంఘం నియమించిన అబ్జర్వర్లు ఆదివారం జిల్లాకు రానున్నారని జిల్లా కలెక్టర్ డా.ఎస్. వెంకటేశ్వర్ శనివారం తెలిపారు. ఈ మేరకు ఆయన మీడియాతో మాట్లాడారు. మునిసిపల్ ఎన్నికల సాధారణ పరిశీలకులుగా ఏపీ స్టేట్ సివిల్ సప్లైస్ కార్పొరేషన్ విసీ, ఎండి డా. మామిళ్ళపల్లి వరప్రసాద్ ను వ్యయ పరిశీలకులుగా ఎస్ పి ఎస్ ఆర్ నెల్లూరు జిల్లా డిఎఫ్ఓ కే.మహబూబ్ బాషా, ఐ ఎఫ్ ఎస్., ను రాష్ట్ర ఎన్నికల సంఘం నియమించిందని, వీరు అక్టోబర్ 18 న ఆదివారం జిల్లాకు రానున్నారని కలెక్టర్ తెలిపారు.

## పుణ్యక్షేత్రంలో ట్రాఫిక్ కష్టాలు...పర్యవేక్షణ ప్రణాళికలు అవసరం

**-ఆర్టీసీ బస్సులు పట్టణంలోనికి రాకుండా... బైపాస్‌రోడుల్లో మినీ బస్టాప్‌లు ఏర్పాటు చేయాలి - అధికంగా వున్న ఆటోలను అదుపుచేయాలి - ట్రాఫిక్ పోలీసు స్టేషన్ ఏర్పాటు చేయాలి**




శ్రీకాళహస్తి, అక్టోబర్ 17 ప్రభాతవార్త: శ్రీకాళహస్తి పుణ్యక్షేత్రం నిత్యం ట్రాఫిక్ చిత్తడిలో సతమత మౌతుంది. ముఖ్యంగా శని,ఆది, సోమవారాల్లో సన్నిధివీధిలో అడుగు తీసి అడుగు వేయటానికి వీలుండదు. ఇప్పటికి శ్రీకాళహస్తికి హోంశాఖ మంత్రి మూడు సార్లు వచ్చారు. వచ్చిన ప్రతి సారి శాసన సభ్యుడు సుధీర్‌రెడ్డి ట్రాఫిక్ పోలీసు స్టేషన్‌ను కోరు తున్నారు. అదిగో అంటూ అరచేతిలో హామీ ఇవ్వటం మినహా ఆచరణకు నోచుకోవటం లేదు. శ్రీకాళహస్తి వన్‌టౌన్ పరిధిలో పట్టణం ఉంది, అయితే సిబ్బంది లేకుండా ట్రాఫిక్‌ను ఎలా నడపాలనేది సమస్యగా వుంది. కొత్తగా అధికారం చేపట్టిన డిఎస్పీ అయినా ఈ ట్రాఫిక్ సమస్యపై దృష్టి సారించాల్సిన అవసరం ఎంతైనావుంది.

**నాలుగు మాడావీధుల్లో నరకం:**

శ్రీకాళహస్తి పట్టణంలో ట్రాఫిక్ సమస్య రోజురోజుకు జటిలమౌతుంది.ఇరుకు వీధుల్లో వాహనాల ప్రయాణం నరకప్రాయంగా మారింది. అయితే ట్రాఫిక్ నిబంధనలను ఆటోల చోదకులు ఆచరించటం లేదు. అమలు పరచాల్సిన పోలీసులు పట్టించుకుంటే ఎక్కడ నుంచి ఫోన్ వస్తుందో అని పట్టించుకోవటం లేదు. దాంతో ఈ వీధుల్లో పయనం నరకయాతనగా మారింది. ముఖ్యంగా ఆలయ ప్రధాన ద్వారాలైన జయరామరావు వీధి, తేరువీధి, నెహ్రూ వీధి, బేరి వారి మండపం, నగిరి వీధి ప్రాంతాల్లో ఉదయం నుంచి సాయంత్రం వరకు వాహనాలు కిలోమీటర్ల మేర నిలిచిపోతున్నాయి. వన్ వే ట్రాఫిక్ లో భాగంగా నగిరి వీధి గుండా కొన్ని వాహనాలు బేరివారి మండపం వరకు కలిసి ప్రయాణించాల్సిన దుస్థితి ఏర్పడి ఉంది. అయితే నగిరి వీధిలో షాపింగ్ మాల్స్ ఓ పాలకోవా దుకాణం ఉండడంతో నిత్యం వాహనాలు ఇక్కడే పార్కింగ్ చేయడం వలన ట్రాఫిక్ సమస్య మరింత పెరుగుతోంది. దేశ నలుమూలల నుంచి వేలాది మంది భక్తులు రోజూ శ్రీకాళహస్తీశ్వర స్వామి దర్శనం కోసం వస్తారు. కానీ తేరు వీధిలోకి అడుగుపెట్టగానే వారికి దర్శనం కంటే ముందే ట్రాఫిక్ చిత్తడి నరకం చూపిస్తుంది. ఇరుకైన రోడ్డుపై ఇరువైపులా ఆటోలు నిలపడం, హోటళ్ళు, లాడ్జీల ముందు వాహనాలు ఆపేయడంతో పరిస్థితి ఆగమ్యగోచరంగా మారింది.

**సిబ్బంది కొరత: దిష్టిబొమ్మల్లా సిగ్నల్స్:**

శ్రీకాళహస్తిలో నిత్యం ట్రాఫిక్ స్థంభించిపోతున్నా పట్టించుకునే నాధుడే లేదు. ఇక్కడ రెగ్యూలర్ కానిస్టేబుల్స్ ట్రాఫిక్ యూనిఫారం ధరించి విధులు నిర్వహించాలి. ఈ సమస్య జిల్లా ఎస్‌పికి తెలియనిది కాదు. ప్రత్యేక ట్రాఫిక్ పోలీసు స్టేషన్ దానికి బాధ్యత కల్గిన అధికారి ఉండాలి. ట్రాఫిక్ ఎస్ఐ ఉన్నారు, ఆయన వాహనంపై హారన్‌తోనే పరుగులు తీస్తారు.

**డీఎస్పీ స్పందించాలి:**

ఇటీవల బాధ్యతలు చేపట్టిన డీఎస్పీ ఈ సమస్యపై వెంటనే దృష్టి సారించాలని ప్రజలు, భక్తులు కోరుతున్నారు. పట్టణంలోనికి బస్సులు రావడంపై ప్రత్యేక కార్యాచరణ తీసుకోవాలి. ఇరుకైన వీధుల్లో ఆర్టీసీ బస్సులు రావడంతో విపరీతమైన ట్రాఫిక్‌గా నిలిచిపోతున్నది. వీటికి బైపాస్‌లోనే మినీ బస్టాప్‌లు ఏర్పాటు చేసి, బస్సులు పట్టణంలోనికి రాకుండా బైపాస్ మీదుగా ఆర్టీసి బస్టాండుకు చేరే ఏర్పాట్లు చేయాలి. ఇవి చేయకపోతే రానున్న కార్తీక మాసం, పండుగల సమయంలో పరిస్థితి మరింత దారుణంగా మారుతుంది. డీఎస్పీ స్పందించి చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

## ఆలయాల్లో పూజలు...భక్తులకు అన్నదానాలు



శ్రీకాళహస్తి,అక్టోబర్ 17 ప్రభాతవార్త: శ్రీకాళహస్తిలోనూ, చుట్టుపక్కల గ్రామాల్లో వెలసిన అమ్మవారి ఆలయాల్లో శనివారం బియ్యపు పవిత్రారెడ్డి తన అనుచరులతో కలసి అమ్మవార్లను దర్శించుకోవటమే కాకుండా భక్తులకు అన్నదానాలు నిర్వహిస్తున్నారు. పవిత్రారెడ్డి భవాని దీక్ష మాల ధరించి ఆకర్షణీయంగా పూజలు నిర్వహిస్తున్నారు. ఈ నేపథ్యంలో శనివారం ఆమె పట్టణ నడిబొడ్డులోని కృష్ణారెడ్డి మండపంలో దేవస్థానం ఏర్పాటు చేసిన అమ్మవారి విగ్రహానికి ప్రత్యేక పూజలు జరిపించుకున్నారు. అలాగే కనకాచలం దిగువ ఏర్పాటు చేసిన దుర్గమ్మను, భాస్కరపేటలో వెలసిన చాముండేశ్వరి అమ్మవారిని శ్రీకాళహస్తికి సమీపంలోని వేడాం గ్రామంలో వెలసిన దక్షిణ కాళీమాత ఆలయంలో వెలసిన అమ్మవారిని దర్శించుకున్నారు. భక్తులకు అన్నదాన కార్యక్రమాలను నిర్వహించారు. ఆమెతో పాటు అనుచరులు పులి రామచంద్ర, యుగంధర్, సుధాకర్, పంతులు, కామివేంకటేశ్వర్లు, బుల్లెట్ శ్యామ్ రాయల్, మున్నా రాయల్, సుధాకర్, రమేష్,గుణ,హేమచందర్,భారతమ్మలు ఉన్నారు.

## చెరువును మింగేస్తున్న గ్రావెల్ మాఫియా!



శ్రీకాళహస్తి, అక్టోబర్ 17 ప్రభాతవార్త: శ్రీకాళహస్తి పట్టణంలోని బంగారమ్మ గుడి వెనుక ఉన్న అప్పలాయగుంట చెరువులో గత మూడు రోజులుగా అక్రమ తవ్వకాలు జోరుగా సాగుతున్నాయి. అనుమతులు లేకుండా పగలు, సాయంత్రం వేళల్లో జెసిబిలతో చెరువును తవ్వి ట్రాక్టర్ల ద్వారా గ్రావెల్‌ను తరలిస్తున్నారు. ఒక ట్రిప్ కాదు, రెండు ట్రిప్పులు కాదు, వందల ట్రిప్పుల గ్రావెల్ తరలిపోతోంది. అయినా అధికారులు పట్టించుకోవడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఇది అధికారులకు తెలియకుండా జరుగుతుందా? అని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం చెరువులు, నీటి వనరుల్లో ఎలాంటి మైనింగ్ చేయకూడదు. కానీ ఇక్కడ నిబంధనలు కాగితాలకే పరిమితమయ్యాయి. తవ్వకాల వల్ల ఇప్పటికే చెరువులో లోతైన గుంతలు ఏర్పడ్డాయి. వర్షాలు వస్తే నీరు నిలవదు, భూగర్భ జలాలు పెరగవు. రైతుల పొలాలకు నీరు అందదు. ప్రభుత్వ ఖజానాకు లక్షల రూపాయల నష్టం వాటిల్లుతోంది. ఇది కేవలం గ్రావెల్ దొంగతనం కాదు, భవిష్యత్ తరాల నీటి వనరులను దోచేయడమే అని పర్యావరణ ప్రేమికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

## పేద పిల్లలకు దసరా కానుక



శ్రీకాళహస్తి,అక్టోబర్ 17 ప్రభాతవార్త : చదువుకున్న రోజులు ముగిశాయి. ఒక్కొక్కరు ఒక్కో దారిలో వెళ్లిపోయారు. ఉద్యోగాలు, వ్యాపారాలు, కుటుంబ బాధ్యతలతో 25 ఏళ్లు గడిచిపోయాయి. కానీ వారి మనసులో నాటి స్నేహం మాత్రం చెరిగిపోలేదు. ఆ స్నేహమే ఇప్పుడు సేవగా మారింది. శ్రీకాళహస్తిలోని విక్రమ్ కాలేజీ పూర్వ విద్యార్థులు, శ్రీ సరస్వతీ శిశు మందిర్ పూర్వ విద్యార్థులు సంయుక్తంగా చేసిన సేవా కార్యక్రమం ఇందుకు నిదర్శనం. శివం టు శివం రోడ్డు సమీపంలో ఉన్న లంకమిట్ట ప్రాంతంలో నివసిస్తున్న 40 మంది పేద విద్యార్థులకు దసరా నవరాత్రుల సందర్భంగా నూతన వస్త్రాలను పంపిణీ చేశారు. పండుగ వచ్చిందంటే అందరికీ కొత్త బట్టలు గుర్తుకు వస్తాయి. కానీ ఆర్థిక ఇబ్బందులతో కొత్త బట్టలకు నోచుకోని పిల్లల ముఖాల్లో చిరునవ్వు చూడాలనే సంకల్పంతో ఈ కార్యక్రమం చేపట్టారు. ఒక్కో బిడ్డకు స్వయంగా బట్టలు అందించి, వారితో కాసేపు ముచ్చటించారు. ఇదే కాకుండా ప్రతి సంవత్సరం శివరాత్రి రథోత్సవానికి వచ్చే భక్తులకు, కొండ చుట్టు తిరిగే యాత్రికులకు అన్నదాన కార్యక్రమాలు నిర్వహిస్తూ వస్తున్నారు. కేవలం వాట్సాప్ గ్రూపుల్లో పలకరింపులకు పరిమితం కాకుండా, కలిసి ఒక మంచి పని చేయాలనే వారి ఆలోచన చాలా మందికి స్ఫూర్తినిస్తోంది.

## ఆకలి తీర్చిన చిన్నారి పుట్టినరోజు



తొట్టంబేడు, అక్టోబర్ 17 ప్రభాతవార్త: సాధారణంగా పుట్టినరోజు అంటే కేకులు, హోటళ్ళు, డీజే సౌండ్స్. కానీ మూడేళ్ల చిన్నారి పుట్టినరోజు మాత్రం ఐదువందల మంది ఆకలి తీర్చింది. అదే కలవగుంట త్రిషికారెడ్డి పుట్టినరోజు ప్రత్యేకత. తొట్టంబేడు మండలానికి చెందిన ప్రముఖ సంఘ సేవకులు, మహదేవ ట్రస్ట్ వ్యవస్థాపకులు కలవగుంట భరత్‌రెడ్డి కుమార్తె కె.త్రిషికారెడ్డి మూడవ జన్మదినాన్ని పురస్కరించుకుని అంబిలి స్వామి ఆశ్రమంలో ఘనంగా అన్నదానం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆశ్రమ నిర్వాహకులు, మహదేవ ట్రస్ట్ సభ్యులు, సీనియర్ పాత్రికేయులు చంద్రశేఖర్, బాలు, మోతీష్, ప్రభాకర్, కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

### తొట్టంబేడులో టీడీపీకి షాక్...

## ఇద్దరు కీలక యాదవ నేతలు వైసీపీలోకి!



తొట్టంబేడు, అక్టోబర్ 17 ప్రభాతవార్త: స్థానిక సంస్థల ఎన్నికలు సమీపిస్తున్న వేళ తొట్టంబేడు మండలంలో తెలుగుదేశం పార్టీకి పెద్ద ఎదురుదెబ్బ తగిలింది. మండలంలో పట్టు ఉన్న ఇద్దరు యాదవ సామాజిక వర్గ నేతలు ఏకకాలంలో టీడీపీని వీడి వైసీపీ గూటికి చేరారు. జ్ఞానమ్మకండ్రిగకు చెందిన రామయ్య యాదవ్, బసవయ్యపాలెంకు చెందిన పవన్ యాదవ్ శనివారం శ్రీకాళహస్తి పట్టణంలోని వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో మాజీ ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్ రెడ్డి, ఉమ్మడి చిత్తూరు జిల్లా వైకాపా కార్యదర్శి ఉన్నాం.వాసుదేవా నాయుడు సమక్షంలో వైకాపా తీర్థం పుచ్చుకున్నారు. మధుసూదన్ రెడ్డి వారికి కండువా కప్పి సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు. స్థానిక ఎన్నికల్లో ఈ రెండు గ్రామాల్లో యాదవ సామాజిక వర్గం ఓట్లు నిర్ణయాత్మకంగా ఉంటాయి. రానున్న పంచాయతీ, ఎంపీటీసీ ఎన్నికల్లో ఇది వైసీపీకి కలిసి వస్తుందని పార్టీ శ్రేణులు భావిస్తున్నాయి. టీడీపీలో తమకు తగిన గుర్తింపు, ప్రాధాన్యత లభించలేదని, వైసీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఆశయాలకు ఆకర్షితులై చేరుతున్నామని నేతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉమ్మడి చిత్తూరు జిల్లా ప్రధాన కార్యదర్శి ఉన్నం వాసుదేవ నాయుడు, సుబ్బరాయులు తదితరులు పాల్గొన్నారు.

## మల్లిగుంటలో వరుస మోటార్ చోరీలు



తొట్టంబేడు, అక్టోబర్ 17 ప్రభాతవార్త: పొలంలో పంట పండాలంటే నీరు ముఖ్యం, నీరు పారాలంటే మోటారు ముఖ్యం. అలాంటి మోటార్లనే దొంగలు లక్ష్యంగా చేసుకుంటున్నారు. తొట్టంబేడు మండలంలోని తాటిపర్తి పంచాయతీ మల్లిగుంట గ్రామంలో జరిగిన చోరీ రైతులను తీవ్ర ఆందోళనకు గురిచేసింది. మల్లిగుంట గ్రామానికి చెందిన కోగిల ధనంజయ, కోగిల తిరుపాలు తమ పొలాల వద్ద ఏర్పాటు చేసుకున్న విద్యుత్ మోటార్లను గుర్తు తెలియని దుండగులు శుక్రవారం రాత్రి ఎత్తుకెళ్లారు. శనివారం ఉదయం పొలాలకు వెళ్లిన రైతులు మోటార్లు లేకపోవడంతో షాక్ అయ్యారు. చుట్టుపక్కల వెతికినా ఆచూకీ దొరకలేదు. ఒక మోటారు కొనాలంటే రైతుకు రూ. 15 వేల నుంచి 25 వేల వరకు ఖర్చవుతుంది. అప్పు చేసి, కూలి పని చేసి సంపాదించిన డబ్బుతో కొన్న మోటార్లు ఇలా పోతే రైతు మళ్ళీ కొనగలడా అనేది రైతుల ఆవేదన. ఇది ఒకటి రెండు చోరీలు కాదు, వ్యవస్థీకృత ముఠా పనే అయ్యుంటుందని రైతులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. పాత ఇనుము, రాగి వైర్ల కోసం మోటార్లను విప్పి అమ్మేస్తున్నారని చెబుతున్నారు. పోలీసులు వెంటనే స్పందించి చోరీకి పాల్పడిన వారిని గుర్తించి కఠిన చర్యలు తీసుకోవాలని, లేకపోతే రైతులే పొలాల వద్ద రాత్రి కాపలా కాయాల్సిన దుస్థితి వస్తుందని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

## గంగపుత్ర గాంధీకి చంద్రప్ప అభినందనలు!



శ్రీకాళహస్తి, అక్టోబర్ 17 ప్రభాతవార్త: శ్రీకాళహస్తి మత్స్యకార సంక్షేమ సమితి పట్టణ అధ్యక్షుడిగా నూతనంగా ఎన్నికైన గంగపుత్ర గాంధీకి చంద్రప్ప మర్యాదపూర్వకంగా శాలువాతో సత్కరించి హృదయపూర్వక అభినందనలు తెలియజేశారు. పట్టణంలోని శ్రీ కావమ్మ గుడి వీధిలో ఉన్న శ్రీ కావమ్మ మందిరం వద్ద ఈ సత్కార కార్యక్రమం జరిగింది. మత్స్యకార సంక్షేమ సమితి నూతన కార్యవర్గ ఎంపిక, భవిష్యత్తులో చేపట్టాల్సిన కార్యక్రమాలు, మత్స్యకారుల సంక్షేమానికి సంబంధించిన పలు అంశాలపై చర్చించారు. ఈ నెల 28, 29 తేదీల్లో నిర్వహించనున్న మత్స్యకార సంక్షేమ సమితి సమావేశానికి సంబంధించి కార్యాచరణ ప్రణాళిక రూపొందించేందుకు చర్చించనున్నట్లు గంగపుత్ర గాంధీ తెలిపారు. ఈ సమావేశానికి బెస్త సంఘ పెద్దలు, ప్రముఖులు, సంఘ ప్రతినిధులు పెద్ద సంఖ్యలో హాజరై తమ విలువైన సూచనలు, సలహాలు అందించాలని ఆయన ఈ సందర్భంగా ఆహ్వానించారు.

## రక్తబీజాక్షరి అలంకారంలో అమ్మవారు




శ్రీకాళహస్తి,అక్టోబర్ 17 ప్రభాతవార్త: శ్రీకాళహస్తీశ్వరాలయంలో నిర్వహిస్తున్న దసరా ఉత్సవాల్లో శనివారం రాత్రి అమ్మవారికి రక్తబీజాక్షరి అలంకారం నిర్వహించారు. ఇక్కడ అమ్మవారి అలంకారాలను సురేష్ గురుకుల్,రాజేష్ గురుకుల్ నిర్వహిస్తున్నారు. అమ్మవారి గర్భగుడి ఎదురుగా ఏర్పాటు చేసిన బొమ్మల కొలువులో అమ్మవారికి ఉదయం,రాత్రి ఒక్కొక్క అలంకారం నిర్వహిస్తున్నారు. అలాగే దుర్గమ్మ విగ్రహానికి కూడా ప్రత్యేక అలంకారాలు నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా ఉత్సవ మూర్తికి ప్రత్యేక అలంకారం జరిపారు. ఆలయ ఎఇఓ విద్యాసాగర్‌రెడ్డి పూజలు నిర్వహించగా ఆలయ ఆవరణలో ఉత్సవాన్ని ఆలయ ప్రదానార్చకులు కరుణాకర్ గురుకుల్ పర్యవేక్షణలో సూరి గురుకుల్ హారతులిచ్చి ఉత్సవం నిర్వహించారు.